శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహారాజ్ కీ జై! సద్గురు శ్రీసాయినాథుని శరద్బాబూజీ కీ జై!



అనుగ్రహానంద మహోత్సవం

25

రసరమ్య రజతోత్సవం

గురువన్న ఎవరో ఎరుక పరచే సాయి... పరమార్థమందగా పథమతడే చూపునోయి.

# గురుకృప

విజయదశమి సంచిక



"ఇది బ్రాహ్మణ (బ్రహ్మజ్ఞానం కలిగినవాడు) మసీదు.
ఈ సద్బ్రాహ్మణుడు లక్షలాదిమందిని
శుభ్రమార్గాన నడిపించి,
చివరికంటా గమ్యం చేరుస్తాడు"
అని అభయం ఇచ్చారు శ్రీసాయిబాబా.

# సాయిపథం

**బాబా అనుగ్రహ శుభ్రమార్గం,**
**శ్రీబాబూజీ ఆచరించి ప్రబోధించిన బాబాపథం - సాయిపథం.**

శ్రీబాబూజీ మాటల్లో సాయిపథం అంటే - శ్రీసాయిబాబా చూపిన మార్గం, బాబా నడిచిన బాట, 'సాయి' అనే గమ్యానికి రహదారి. ఏ ఒక్క మత సాంప్రదాయానికి చెందక ప్రపంచంలోని అందరు మహాత్ములు ఆచరించి బోధించిన విశ్వజనీన ఆధ్యాత్మిక సాంప్రదాయమే ఈ సాయిమార్గం. మరో మాటలో సాయిపథం అంటే సద్గురుపథం. సాయిపథానికి శ్రీసాయియే ఆధారం, జీవం, మార్గం, గమ్యం, సర్వం. "బాబాను కేంద్రంగా చేసుకుని అల్లుకున్న జీవన విధానం - సాయిపథం". ప్రతి వ్యక్తికి లక్ష్యం ఉండాలి. మన లక్ష్యం, గమ్యం ఎంత ఉన్నతమైనదో, పవిత్రమైనదో వాటిని చేరే మార్గం అంతే పవిత్రంగా, ఉన్నతంగా ఉండాలి అంటారు శ్రీబాబూజీ. శ్రీబాబూజీ విశిష్ఠ వ్యక్తిత్వానికి, అంతరంగానికి ఈ ప్రబోధమే ఒక ప్రమాణంగా నిలుస్తుంది. అడ్డుత్రోవలో, వక్రమార్గంలో, అక్రమంగా, ఎలాగైనా సరే త్వరితగతిన లక్ష్యాన్ని చేరాలనే భావనలకు శ్రీబాబూజీ నిర్దేశించిన సాయిపథంలో చోటు లేదు. "లక్ష్యాన్ని చేరడం ఒక్కటే ప్రధానం కాదు. ఆ లక్ష్యాన్ని బాబా చూపిన శుభ్రమార్గంలోనే చేరామా? లేదా? అనేది కూడా ప్రధానం" అంటారు. మనం నిర్దేశించుకున్న లక్ష్యాన్ని త్వరితగతిన చేరగలిగినా అది బాబా చూపిన పవిత్రమార్గం కానపుడు అది నిష్ఫలమే అవుతుంది. ఆ అపవిత్రపు మార్గం, బాబా చేర్చాలనుకున్న గమ్యానికి చేరువ కానీయక, మనమే ఏర్పరచుకున్న అడ్డంకియై, గమ్యానికి మరింతగా దూరం చేస్తుందంటారు శ్రీబాబూజీ.




**శ్రీబాబూజీ మానసం నుండి ఉద్భవించి**
**భక్తి రసగంగగా ఉప్పొంగిన ఆనందపథం - సాయిపథం**

సంపుటి : 25
సంచిక : 4

విజయదశమి 5
2022



# గురుకృప



## సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి!
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయకుహరంలోని నిశ్శబ్దనిశీథిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞానసౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞానసౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృతధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృతధారలలో తడుస్తూ, ఆ జ్ఞానసౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!'
అని అందరూ ఏకకంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధురస్వప్నం.
ఆ స్వప్నసాఫల్యం కోసం శ్రీసాయినాథుని అనన్యప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది, చేయవలసింది.

– శ్రీబాబూజీ

## లోపలి పేజీలలో

4 పథగామి
– గురుకృప

7 ఎందెందు వెదకి చూచినా...
– గురుకృప

10 శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్రము - వివరణము
– మాస్టర్ పార్వతీకుమార్

14 STORY ABOUT SEEING
– శ్రీబాబూజీ

20 ఉద్బోధన్, జయరాంబాటిలలో శ్రీశారదామాత
– గురుకృప

25 గురుకృపాలహరి
– గురుకృప



నిర్వహణ : **గురూజీ ఆశీస్సులతో – గురుబంధువులు**

**GURUKRUPA**
Printed at : Ramakrishna Printers, Visakhapatnam. Web : www.gurukrupa.info



# పథగామి

## నిత్య జీవితానికి నియమావళి

**మనిషిని దేవునిగా మలచుటకు మనిషిగా దిగి వచ్చిన దేవుడు గురువు.** శారీరక, మానసిక ఆరోగ్యం కోసం మహర్షులు షడంగాలలో ఒకటైన యోగ మార్గాన్ని సమాజ శ్రేయస్సును కాంక్షించి అందచేసారు. ఒకనాడు మానవుణ్ణి తీర్చిదిద్దడానికి, సరియైన మార్గంలో నడిపించడానికి సంఘం ఏర్పరచుకున్న కొన్ని నియమాలు కట్టుబాట్లు ఉండేవి. మానవుడు ఆ నియమాలను, కట్టుబాట్లను ఉల్లంఘించినపుడు వాటి నుండి ప్రక్కకు జారినపుడు మొదటగా తల్లిదండ్రులు, ఆపై పెద్దల మందలింపులు ఉండి, నడతను సరిచేసేవి. గురుకులవాసంలో గురుదేవుల సాన్నిధ్యంలో విద్యార్థిగా క్రమశిక్షణతో విద్యాభ్యాసం చేసి, బ్రహ్మచర్యాశ్రమాన్ని పండించుకొని, గృహస్థాశ్రమంతో మానవుడు పరిపూర్ణుడయ్యేవాడు. కొన్ని దశాబ్దాల క్రితం మనిషికి ఇంత కదలిక లేదు. అక్కడక్కడే తిరుగుతుండేవాడు. కలిసిన వాళ్ళనే కలుస్తూ ఉండేవాడు. ఏటి అవతలకు పిల్లనివ్వడానికి కూడా ఇష్టపడేవాడు కాదు. కట్టుబాట్లు, వేషభాషలు ఉన్నవి ఉన్నట్లుండేవి. తొందరగా మారేవి కావు. అతడు మార్చుకోవడానికి కూడా ఇష్టపడేవాడు కాదు. ఇన్నాళ్ళూ ఇలా బ్రతికాం. మధ్యలో ఎందుకు ఇంకోదానికి మారడం అనుకునేవాడు. అతనిలో ఒక కట్టు కనిపించేది, ఒక పట్టు కనిపించేది. అతనిదంటూ ఒక వ్యక్తిత్వం కనిపించేది. అదో పద్ధతిగా అలా సాగిపోయేది. దశాబ్దాలు గడిచాయి. ప్రపంచ పరిస్థితులు మారాయి. రవాణా సౌకర్యాలు పెరిగాయి. మనిషికి ప్రపంచం ఎంత పెద్దది అని తెలిసిందో, అంతలో అంత చిన్నది కూడా అయిపోయింది.

ఇప్పుడతను కొద్దిరోజుల్లో దేశాలు మారగలడు. కొద్దిరోజుల్లో ప్రపంచాన్నే చుట్టిపెట్టగలడు. ఈ పరిణామంతో ఎక్కడెక్కడి ప్రజలు దగ్గరవుతున్నారు. ఒకరి భావం ఒకరిపైన సులువుగా పడుతుంది. ఇప్పుడు మనం చూస్తూండగానే కట్టుబాట్లు సడలిపోతున్నాయి. వేషభాషలు మారిపోతున్నాయి. మనిషిలో ఇంతకు పూర్వం ఉన్న కట్టు, ఇంతకు పూర్వం ఉన్న పట్టు ఇప్పుడంతగా కనబడటం లేదు. మారుతున్న పరిస్థితులలో చేసేది లేక అతడు రాజీపడిపోతున్నాడా? లేక కావాలనే కోరి మారిపోతున్నాడా? లేక నలుగురితోనే మనుమూను అని సరిపెట్టేసుకుంటున్నాడా? ఏదీ చెప్పలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఒకరకంగా చూస్తే అతడిలో ఇన్ని భావాలూ ఉన్నాయనిపిస్తుంది. ఏది ఏమయినా విభిన్న తరహాల ప్రజల మధ్య తీవ్రమైన సంసర్గం ఏర్పడుతోంది. తెల్లవారి లేస్తే ఒక్కొక్కరు ఎంతమందిని కలుస్తున్నారో, ఎన్ని విధాలయిన వారిని కలుస్తున్నారో, ఎన్ని ప్రాంతాలను పట్టి



తిరుగుతున్నారో! జన సంసర్గం పెరిగిపోతోంది. ఇంతగా సంసర్గం పెరిగిపోతున్న ఈవేళ మనం మనంగా నిలబడగలమా? మనం నమ్ముకున్న విలువలను మనం కాపాడుకోగలమా? ఈ సంసర్గాల ప్రభావాన్ని మన అవసరాన్ని దాటి మనమీద పడనీయకుండా ఉండగలమా? మనం మనంగా బ్రతుకగలమా? అన్నది ఒక ప్రశ్న అవుతుంది. ఇంటి నుండి బయలుదేరిన మనం మనలాగే మళ్ళీ మన ఇంటికి చేరగలమా? అన్న అనుమానం కలుగుతోంది.

కొన్ని శతాబ్దాల క్రితం మనిషిపైన అడుగడుగునా అదుపొకటి ఉండేది. చిత్రమైన అదుపు అది. మనిషిని పట్టాలపైన నడిపించేది. పట్టాలు తప్పబోతున్నపుడల్లా 'ఓయ్' అని హెచ్చరించేది. ఊహ తెలిసేటప్పటికీ గురుకులవాసం, గురుకులంలో తీర్చిదిద్దబడి ఇంటికి వచ్చేటప్పటికీ వివాహం, సామాజిక బాధ్యతలు, వృత్తి నిర్వహణ! వీటన్నింటిపైనా తల్లిదండ్రుల పర్యవేక్షణ, తల్లిదండ్రులను ఏ వేళనైనా అతిక్రమించే ప్రయత్నం జరిగినపుడు గ్రామ పెద్దల పరామర్శ, అవసరాన్ని బట్టి వారి విచారణ, పరిస్థితిని బట్టి మందలింపు, తగిన శిక్షణ. గ్రామ పెద్దలు చేయిదాటితే, పాలకుని చెంతకు ప్రవేశపెట్టడం, అతడు చెప్పింది చెప్పినట్లుగా చేసుకోవడం! ఇన్ని రకాల అదుపులు ఇన్ని స్థాయిలలో ఏర్పాటు చేయబడి ఉండేవి. అతడు చెడిపోవడానికి వీలు కలుగకుండా చూసేవి. **'మన జీవితం మనది మాత్రమే కాదు'**. దారి తప్పితే మనం ఒకరికి జవాబు చెప్పుకోవాలి అన్న స్థితిలో పెట్టేవి. ఆ అదుపులోనే మనిషికి ఒక శిక్షణ లభించేది. ఒక రక్షణ కూడా లభించేది. నేను ఒంటరివాడిని కాదు. నన్ను, నా జీవితాన్ని పట్టించుకునేవారు ఇందరున్నారు–అన్న ధీమా, తృప్తి కూడా లభించేవి. (ఇదే మనకు నిజమైన బీమా... అదే మన ధీమా కావాలి) తలుపు అలా ఓరగా వేసి ఆలు బిడ్డలతో కలిసి గుండెల మీద చేయి వేసుకొని నిశ్చింతగా నిద్రపోయేవాడతను. క్రమంగా ప్రపంచ పరిస్థితులు మారాయి. మనిషిపైన అంతవరకు ఉన్న అదుపు తగ్గిపోసాగింది. ఇక మనిషిపైన అదుపంటూ అసలు ఉన్నదా! అన్న పరిస్థితి దాకా వచ్చింది. ఎవరు ఎలాగైనా ప్రవర్తించవచ్చు. ఎవరు ఎవరిని ఏమైనా చేయవచ్చు – అన్న స్థితి దాకా వచ్చింది. దీనిని స్వేచ్ఛ అనాలా? లేక అదుపులేని స్థితి అనాలా? ఈ స్థితిని చూసి సంతోషించాలా? లేక బాధపడాలా? ఇపుడు విద్యార్థులపైన విద్యాలయాల అదుపులేదు, పిల్లలపైన తల్లిదండ్రుల అదుపులేదు. ఊరి ప్రజలపైన గ్రామపెద్దల అదుపులేదు. దేశవాసులపైన పాలకులకు అదుపులేదు. ఎటునుండీ అదుపులేదు. ఇక మనిషి తనను తాను అదుపులో ఉంచుకోగలిగితే కొంతవరకు మనిషిలాగే మనగలుగుతాడు. లేకపోతే అతడేమైనా కావచ్చు.



దుర్భలుడై వ్యసనపరుడు కావచ్చు. దుష్టుడై ప్రజాకంటకుడు కావచ్చు, స్వార్థపరుడై దోపిడీదారు కావచ్చు, నయవంచకుడై మోసగాడు కావచ్చు, అతడేమైనా కావచ్చు. అతడిపైన ఇపుడు అదుపులేదు, ప్రభుత్వం పొదుపు సంగతి ఆలోచిస్తున్నది. అది కూడా ఏమీ చేయలేకపోతున్నది. అసలు ఇది అదుపు సంగతి ఆలోచించగలదా? అలాంటి అదుపులేని ఈ పరిస్థితులలో మనిషి తాను తానుగా ఎంతకాలం ఉండగలుగుతాడు! అలా ఉండాలని ఎంతమంది అనుకుంటారు! ఎవరికి వారు మిగిలిన వారిని బట్టి మనం కూడా! అని అనేసుకుంటే ఈ సమాజం ఏమైపోతుంది?

కాని కాలం చిత్రమైంది. అవ్యవస్థ నుండి వ్యవస్థ, వ్యవస్థ నుండి అవ్యవస్థ, మళ్ళీ అవ్యవస్థ నుండి వ్యవస్థ రాత్రీపగలూ లాగ ఒకదాని తరువాత ఒకటి ఒకదాని నుండి ఒకటి రూపుకట్టుకుంటూనే ఉంటాయి. సృష్టి కథను ముందుకు నడుపుతూనే ఉంటాయి. **ఇంకా తెలవారదేమీ! ఈ చీకటి విడిపోదేమి**? అని అడిగేవాళ్ళు కాలకాలాలలో పుట్టుకొస్తూనే ఉంటారు. తాము వైతాళికులుగా రూపొంది మిగిలిన వారిని నిద్రలేపుతూ ఉంటారు. లేచే వరకూ లేపుతూ ఉంటారు. ఈ లోపల తెల్లవారుతుంది. సమాజం బ్రతికి బట్టకడుతుంది.

హైదరాబాదులో సోదర బృందంతో గోష్ఠి జరుగుతూ ఉంది. ఒక ఇద్దరు ముగ్గురు సోదరులు లేచి ఆర్తితో అడిగారు. "అందరి తరపునా అడుగుతున్నాము" అన్నట్లుగా అడిగారు. **"గురువుగారూ! మీ నుండి నిత్య జీవితానికి ఒక నియమావళి రావాలండీ!"** అని వారింకా ఇలా అన్నారు. "చదువుల రీత్యా, ఉద్యోగాల రీత్యా తల్లిదండ్రులకు దూరంగా పిల్లలు తమకు తామే పెద్దలయి బ్రతుకుతున్న రోజులివి. ఇది మంచని తెలియదు, ఇది చెడని తెలియదు. ఇది చేయవచ్చు అని తెలియదు, ఇది చేయకూడదు అని తెలియదు. ఏది ఎందుకు చేయాలో తెలియదు. ఏది ఎందుకు చేయకూడదో తెలియదు. దీని వెనుక ఏముందో తెలియదు. ఎవరినైనా అడుగుదామంటే ఇవన్నీ చెప్పగలిగేవారు ఎవరో తెలియదు. ఏదో తోచినట్లు బ్రతికేస్తున్నాం. అలాంటి మేము, మాకే ఏమీ తెలియని మేము, ఇక మా పిల్లలకు ఏం చెప్పగలం! ఏమి నేర్పగలం. వారికి కావలసిన సాంస్కృతికమైన పునాదిని మేమెలా రూపొందించగలం? కనుక మీలాంటి పెద్దలు పూనుకొని నిత్య జీవితానికి కావలసిన నియమావళిని మాకందిస్తే **ఆ గ్రంథాన్ని** మా ఇళ్ళలో ఒక పెద్దదిక్కుగా పెట్టుకుంటాం. ఆ గ్రంథం చెప్పినట్లు మేం తెలిసికొంటూ నడుచుకుంటాం. మా పిల్లలకు కూడా ఆ సూక్ష్మాలను తెలుపుకుంటూ నడుపుకుంటాం. సదాచారం (సదా–ఆచరించునది) అనే అధ్యాయంగా ఈ నిత్య జీవితానికి



నియమావళిని మీరు అందిస్తూ వస్తున్నట్లుగా తెలుసుకున్నాం. మీరు చాలా మంచిపని చేస్తున్నారు. కానీ మీ బోధ ఆ విద్యార్థులకు మాత్రమే అందుతోంది. మరి మా వంటి వారి సంగతి ఏమిటి అన్నది మా బాధ. కనుక మీరు వీలయినంత త్వరలో మీచేత చెప్పబడుతున్న సదాచారాన్ని నిత్య జీవితానికి నియమావళిగా తీర్చిదిద్ది సకల మానవాళికి అందించవలసిందిగా కోరుతున్నాం. అది మీ వాక్కు నుండి వెలువడాలి. మీ వాక్కు నుండి వెలువడితే అప్పుడు మాకు చదువ బుద్ధి అవుతుంది. అలా ఆచరించ బుద్ధి అవుతుంది. మీ వాక్కుకంత శక్తి ఉంది. మా కొరకే అది అంత శక్తిమంతంగా వెలువడుతున్నది అన్నారు వాళ్ళు.

మీరు కోరుతున్న కోరిక లోకహితమైనది! గుండెలోతుల్లో నుండి కోరుతున్నారు మీరు. మీ కోరిక తీరుతుంది. ఆ గ్రంథం వెలువడుతుంది. మీతోపాటుగా నేను కూడా మురిసిపోయే ఆ శుభ ఘడియలు వస్తాయి అన్నాను నేను. అన్నట్లుగానే వచ్చాయి ఇప్పుడు. ఇక అందుకోండి మీరు. ఇన్నాళ్ళుగా కోరుకున్న ఆ దివ్యగ్రంథాన్ని. భారతీయ సంస్కృతి యొక్క ఫలమిది! పరమ గురువుల ఆశీస్సుల బలమిది.

**– శ్రీమోపిదేవి కృష్ణస్వామి**

## ఎందెందు వెదకి చూచినా...

మన నిత్య జీవితంలో చిరపరిచితాలైన అతి సాధారణ విషయాలను ఆశ్చర్యాలుగా, మనం ఆశ్చర్యాలుగా భావించే విషయాలను అతి సాధారణ విషయాలుగా చూపించి, మన ఈ సృష్టి, సృష్టికర్తపట్ల మన దృక్పథంలో మార్పు తెచ్చి మహాద్భుత ప్రపంచంలోకి మనల్ని చేయి పట్టి నడిపించడానికి మనల్ని చెంతకు చేర్చుకొని, మన సహకారం కోసం సహనంతో ఎదురుచూస్తూ (ద్వారకామాయి–ద్వారం దగ్గర నిలుచున్న తల్లి) హృదయం చుట్టూ తిరుగుతున్న సహనమూర్తి గురువు. ఈ మార్పు వచ్చాక ఇక మనం మనం కాదు, వారి బిడ్డలం అన్న ఎరుకలో మన జీవన యానం సాగడమే–మన చేయి వారు పట్టుకొని నడిపిస్తున్నారు అన్న దానికి గురుతు. అనేక జన్మలుగా ఉన్న అజ్ఞానపు పొరలు తొలగి వసివాడని పసిడి నవ్వులు చిందించే పసిపాపలుగా పునర్జన్మ (నిత్య శిశువుగా) ఎత్తుతారు. ఇది కదా గురువు చెంత మన(ం) పుట్టినరోజు.

**ఎందెందు వెదకి చూచినా....**

ఇల్లు చూచి ఇల్లాలిని చూడమంటారు కదా! అలానే విశ్వేశ్వరుని, సర్వవ్యాపకుని విచారించే ముందు ఆయన సృష్టించిన విశాల విశ్వాన్ని విహంగవీక్షణం చేద్దాం. ప్రకృతి సౌందర్యంలోని



విశేషం ఏ ఒక్కరికో, ఏదో ఒక సమయంలో ప్రత్యేకంగా, వ్యక్తిగతంగా జరిగే అద్భుతం కాదది. అన్ని సమయాల్లో అందరికీ సమానంగా (సమత) అందుబాటులో ఉండే అద్భుతం ఇది. అందుకే అసాధారణమైన ఈ అద్భుతం సామాన్యమైన విషయంలో మరుగున పడిపోవుచున్నది. మనకి అద్భుతం అంటే ఏ ఒక్కరికో లభించింది అన్న భావన. అందుకే బాబా నేను చమత్కారాలు చేయను అన్నది. అది అద్భుతం కాదు. అట్లా గురువుగారు తల్లి చనుబాలు ఉదాహరణ చెప్పి, ఇది ప్రతి తల్లి చేస్తున్న అద్భుతం అంటారు. కాని మన నిత్య జీవితంలో భాగమయిన దాన్ని అద్భుతంగా దర్శించలేకున్నాం. అట్టి దృక్పథం, అట్టి దృష్టి, అట్టి ఆలోచన మనలో రావడమే మన ఆలోచనలో మార్పు రావడం అంటే మహాత్ముల సాంగత్యంలో వారి మాటల ద్వారా, ప్రవర్తన ద్వారా, ఆచరణ ద్వారా ప్రభావితం అవుతున్నామా? ఆ ప్రభావం ఎంతసేపు నిలబడుతున్నది. అందుకే నీ అనుభవాన్ని అంటిపెట్టుకోమంటున్నది. మనం అంటిపెట్టుకోవాల్సింది కూడా ఈ అనుభవాన్నేగానీ, మన కోరికలు, సమస్యలు తీరిన సందర్భాలనే అనుభవాన్ని గాదు. ఇంకా అది వ్యాపకం చెందాలి. అప్పుడే మన అంతరాళంలోని గురుతత్త్వం–మన తనువులోని అణువణువు, కణకణమూ వ్యాప్తం అవుతుంది. సర్వవ్యాపకుడు ఆయన (తత్త్వం) అన్నది మన అనుభవంలో నుంచి వచ్చిన అవగాహనతో మసలుకుంటుంటే దివ్యత్వం వ్యక్తం అవుతుంది. మన ప్రయత్నం లేక, ఇది గురువు మనచేత మనకు తెలియకుండా చేయించే సాధన. ఇది సద్గురుపథం. చెరుకుగడ, మామిడిపండు, గులాబిపువ్వు ఇలా ప్రకృతిలో ప్రతిదీ భూమిలో సారాన్ని, నీటిని గ్రహించి, తియ్యదనాన్ని, ఆహ్లాదాన్నిస్తున్నాయి. ఈ సాధ్యాన్ని కొన్ని లక్షల మంది శాస్త్రజ్ఞులు కలిసి లక్షల సం॥లు కృషి చేసినా, ఈ వింత సాధించగలరా? ఒక సాధారణమైన మొక్క ఈ విచిత్రాన్ని లక్షసార్లు చేసి చూపించగలదు.

మామూలు మట్టి, నీరు చెఱకుగడ ద్వారా ప్రవహించి మధురరసంగా మారిన వైనాన్ని చూస్తుంటే ఈ అద్భుతాన్ని, మహత్యాన్ని, మహిమ (సంరక్షణ)ను దైవం కాక మరెవరు చేయగలరు అనిపిస్తుంది. సూక్ష్మ పరిశీలన లేని కళ్ళకు ఇది మహిమగా కనిపించదు. ఇందులో ఎటువంటి రహస్యము లేదు. తెరచిన పుస్తకం, అందుకే బాబా అన్నది నేను చమత్కారాలు చేయను అని. నా కళ్ళముందు, మీ కళ్ళ ముందు, ప్రతి ఒక్కరి ముందు జరుగుతున్నదే. కాదంటారా? సృష్టికర్త, దేవుడు, దివ్యుడు, భగవంతుడు, పరమాత్మ, సద్గురువు ఇటువంటి పదాలు సరిపోతాయా ఆయనను వర్ణించేందుకు? (కింవచనీయం – కిమవచనీయం గురుమహిమ). ఇంత చూసాక, ఇంత చెప్పాక, చెరకులో దైవాన్ని



నేను దర్శించాను అంటే మీకేమైనా అభ్యంతరమా? ఒక అడుగు ముందుకేసి పరమేష్ఠి చెరకుగా పరిణామం చెందాడని అంటాను. అసలు చెరకుకి, పరమేశ్వరునికి బేధమే లేదని అంటాను తప్పంటారా? అర్థం అయ్యాక, అనుగుణంగా వర్తించడం అంటే... ప్రకృతి సౌందర్యాన్ని ఆరాధించడం ద్వారా మనం దైవారాధన చేయాలి. దైవసన్నిధిని అనుభూతి పొందాలి. మొక్కకు నీరుపోస్తూ, బాబా దాహాన్ని తీరుస్తున్నాను అన్న భావన మెలగాలి మన మనసున. జీవికి ఆకలి తీరుస్తూ, బాబా ఆకలి తీరుస్తున్నాను అన్న ఎరుకతో చేయాలి. ఇది బాబా సన్నిధిని అనుభూతి చెందడం. చేయడంలో బాబా లీలను అనుభవించడం సాధ్యం అవుతుంది. చిన్న చీమ నడక నుండి నభోమండలంలో నక్షత్ర పరిభ్రమణం వరకు సృష్టిలోని ప్రతి కదలికలోనూ ఒక్కొక్క అద్భుతం ఉంది. అంతర్దృష్టి అలవరచుకోండి, (కళ్ళు మూసుకోవడం ద్వారా ఇది జరగాలి) హృదయ కుహర కవాటాలు తెరవండి. సృష్టికర్త అద్భుతాలు మన కళ్ళముందు నిత్యం, నిరంతరం కనిపించే అద్భుతాలు అనుభవంలోకి తెచ్చుకోండి. ఇలా భగవంతుడు మనందరికీ స్పష్టంగా దర్శనమిస్తున్నాడు. అన్నింటిలోనూ ఆయన ఉన్నాడు. ఆయనలో అన్నీ ఉన్నాయి. ఆయన లేని చోటుకి వెళ్ళడం సాధ్యమా? (గురువు – పిల్లవాడు – అరటిపండు – ఎవరూ చూడకుండా తినడం కథ మనకు తెలిసిందే కదా). ఆయన కానిది చూడడం సంభవమా? **"సర్వం ఖల్విదం బ్రహ్మ"** అనే వేదవాక్యం అక్షరసత్యమై జగత్తులో అణువణువునా మోహనంగా నిండిన జగన్మోహనుని దర్శనం అవ్వగానే నా కళ్ళు అసంకల్పితంగా మూసుకున్నాయి. **మోహనంగా నిండిన దానిని చూస్తూ మోహం పెంచుకుంటున్నాము.** ఇక్కడ మనం దారి తప్పుతున్నాం . **'నాగురువు', 'నా దైవం'** అన్న పదాలు వస్తున్నాయి. దారి తప్పాం. గుండె నుండి పొంగిపొరలిన ఆనందం, సంతృప్తి, కృతజ్ఞత కళ్ళ నుండి ప్రవహిస్తున్నాయి. అది యోగమా? ధ్యానమా? అవ్యక్తమైన భావమా? భావాతీతమా? కళ్ళు మూసుకుంటే నిరాకార దైవం, కళ్ళు తెరిస్తే సాకారదైవం. కళ్ళు మూసుకొని గుండె లోతుల్లోకి వెళితే నిరాకార చైతన్యం. కళ్ళు తెరచి చుట్టూ తేరిపార చూస్తే సాకారపరతత్త్వం. ఇక ప్రహ్లాదునికి కనపడినట్లు ఎందెందు వెదకిచూసి అందందే కనిపిస్తుంటాడు. ఇదే శ్రీబాబూజీ చెప్పే **"చూపు తాకినచోట చొక్కముగనీవే"!** విశ్వంపట్ల అవగాహన పెంచుకుందాం. అనుభూతిని పొందుదాం. ఆ అనుభవాన్ని అంటిపెట్టుకుందాం. ఆ అనుభవంతో గురువుని నిత్యం దర్శిస్తూ, స్పర్శిస్తూ, స్మృశిస్తూ, స్మరిస్తూ హృదయంలో చిన్మయునిగా నిలుపుకుందాం. ఇది మన జీవన లక్ష్యం.

– సంకలనం : (జీవన బృందావనం) **– గురుకృప**



**ఫలితానికి ఆలస్యం – దేవుని అలసత్వం కాదు. తిరస్కారం కాదు, తియ్యని పురస్కారం.**



# శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్రము - వివరణము

**శ్యామా బాబాకు మిక్కిలి ప్రియభక్తుడు. బాబా యతనికి మేలు చేయ నిశ్చయించి విష్ణుసహస్రనామమును ప్రసాదముగా ఇచ్చి, దీనిని కొంచెము ఓపికగా చదువుము. రోజునకొక నామము చదివినను మేలు కలుగచేయును అన్నారు శ్రీసాయి.**

**"విష్ణు సహస్రనామం ఉంది. వెయ్యి నామాల యొక్క భావమేమిటి? అంతటా వ్యాపించి ఉన్న దానిని, నిండి ఉన్న దానిని, ఎలా పొందాలనే కదా? కాని ఈ ఉద్దేశ్యంతో ఎంతమంది విష్ణు సహస్రనామాన్ని చేస్తున్నారు? గడగడ ఎక్కాలు అప్పచెప్పినట్లు చెప్పడం తప్పితే? అంత కష్టపడే బదులు మనకీరోజు సులభమైన మార్గముంది కదా? బాబా – వారి రూపము, ఆచరణ, వారి జీవితంలోని ప్రతి కదలిక ద్వారా అంతటా ఉన్న చైతన్యం తానేనని గుర్తింపు ఇచ్చారు సాయి. సాయి అన్నప్పుడల్లా అదే భావం మనసులో నిలబడుతుంది. అయితే యాంత్రికంగా చేస్తే ఇదీ తప్పే. అర్థవంతంగా చేస్తే ఏదైనా సరియైనదే. అన్నింటి ఉద్దేశ్యమూ అదే" – శ్రీబాబూజీ**

మా చిన్నప్పుడు కథ ఇచ్చేవారు తెలుగు పుస్తకంలో. అది నిజంగా భాగవతంలో లేదు, అయినప్పటికీ మంచి స్ఫూర్తినిచ్చే కథ. ప్రహ్లాదుడు చిన్నప్పుడు స్కూల్లో చదువుకుంటూ ఉంటే, వాళ్ళ గురువుగారు అందరికీ తలో కొబ్బరికాయ ఇచ్చారుట. ఇచ్చేసి, ఈ కొబ్బరికాయ 'ఎవరూలేని చోట' కొట్టి రమ్మన్నారట. అంటే అందరూ వెళ్ళి, కొట్టేసి వచ్చారట గభాలున. విద్యాలయమే ఎక్కడో ఊరు బయట అరణ్యంలో ఉంటుంది. అక్కడ ఎవరూ లేకపోవడం అనేది చాలా ఎక్కువగా ఉంటుంది కదా, కొట్టేసి వచ్చేసారు. ఈ ప్రహ్లాదుడు వెళ్ళాడు వెళ్ళాడు, వెళ్ళాడు. ఎక్కడికి వెళ్ళినా, ఎక్కడా కొబ్బరికాయ కొట్టలేక పోయాడు. సరే సాయంత్రం అయ్యింది. ఇంకా తిరిగి రాలేదు. తిరిగి రాకపోతే అప్పుడు కంగారు పడిపోయి ఉపాధ్యాయుడే పిల్లలతో కలసి వెతకడానికి వెళ్తాడు. వెళ్తే, ప్రహ్లాదుడు అలా కొబ్బరికాయ పట్టుకుని తిరుగుతూనే ఉంటాడు అడవుల్లో. అదే ఎవ్వరూ లేనిచోట కొట్టమన్నారు కదా, మరి ఇక్కడ ప్రతీచోటా ఒక చెట్టు కనిపిస్తోంది, ఒక గడ్డిపోచ కనిపిస్తోంది, రాయిబెడ్డ కనిపిస్తోంది. ఇవన్నీ ఉన్నాయికదా? అంటాడు. 'అవి కాదురా' అంటే 'ఆహా అలా కాదు, మీరు ఎవరూ లేనిచోట కొట్టమన్నారు. ఎవరూ లేని చోటు లేదు' అని చెప్తాడు. అని చెప్పి మనకు నీతి ఏమిస్తాడంటే అలా ఉంటాడు దైవము అని. ఇది మాకు ఏడవక్లాసులో కథ. ఈ రోజుల్లో అటువంటి కథలు చెప్పకూడదు. ఎందుకంటే సెక్యూలర్. సెక్యూలర్ పేరున మొత్తం దైవాన్ని, ధర్మాన్ని ఎత్తి అవతల పారేశాం. అందుచేత మనకి స్ఫూర్తి చిన్నతనంలో



రాదు, పెద్దయ్యాక రావడం కష్టం. సరే ఆ విధంగా మనకి ప్రహ్లాదుడు చేసి చూపిస్తాడు. దేవుడు లేని చోటు లేదని కదా! దేవుడు లేని చోటు ఒకటుందా? ఎవరూ లేని చోటు ఏదో గుప్తంగా చెయ్యడానికి మనం. తప్పదు స్వభావం – ఏదో చేస్తాం.

చూడనీలే దైవమే కదా చూస్తాడు అనుకుంటే సుఖం. చూసేది దైవమే కదా! అందుచేత ఆ విధంగా దైవం సమస్తమూ వ్యాపించి ఉన్నాడని గుర్తుండాలి. అందుచేత అతను **సర్వసాక్షి, లోక చక్షుసే** ఇన్ని పేర్లు ఉన్నాయి కదా! అవలోకితేశ్వరుడూ! ఎలా చూస్తూ ఉంటాడు? అంటే చుట్టూ ఉండే రూపాల్లోంచే చూస్తూ ఉంటాడు. అందుచేత మనం విష్ణువు ఆరాధన చేస్తున్నామంటే అది నిరంతరం అవ్వాలి. విష్ణువు ఆరాధన చేస్తున్నాం అని అన్నాం అనుకోండి. ఇక్కడ విష్ణువు అంటే మనం ఎన్నుకున్న మూర్తి కాదు నేను చెప్పేది. సర్వమూ సర్వకాలములయందూ వ్యాపించి ఉన్న తత్త్వము. దాన్ని ఆరాధన చేస్తున్నాము. అది నిద్రలోనూ, మెలకువలోనూ అన్నింటిలోనూ జరగవలసిన సాధన. నిరంతరమైన సాధన. **సాధన నిరంతరమైతేనే నీయందు భక్తి స్థిరపడేది. అలా కాకపోతే స్థిరపడేది ఏమీ ఉండదు. ఏదైనా నిరంతరం కాకపోతే నిలబడదు. అనుశృతంగా జరుగుతూ ఉండాలి.**

మనం ఇపుడు విశాఖపట్నం నుంచి కొంతమంది, హైదరాబాద్ నుంచి కొంతమంది, బెంగుళూరు నుంచి బయలుదేరి కొంతమంది ఇలా వచ్చాం కదా! ఈ వస్తుంటే దారిలో ఎంతసేపు మనకి దైవం గుర్తున్నాడు? రైలు రూపంలోనూ, రైల్లో వాళ్ళ రూపంలోనూ, తోటి ప్రయాణికుల రూపంలోనూ? అది లెక్క? యాత్రకి అది లెక్క. తీర్థయాత్రకి బయలుదేరినవాడు, బయలుదేరిన క్షణం నుంచి దైవదర్శనమై మళ్ళీ ఇంటికి వెళ్ళేంతవరకు కూడా అదే దైవాన్ని అంతటా, అన్ని సమయాల్లోనూ చూడటం తీర్థయాత్ర అవుతుంది. వాడు యాత్రికుడు అవుతాడు. లేకపోతే **విజిటర్** అవుతాడు. **జస్ట్ ఎ విజిటర్.** (మనం శిరిడీ వెళదాం అనుకున్నప్పటి నుండి బాబా ఎలా తీసుకుపోతున్నారో గమనించుకుంటూ ఉండాలి **–శ్రీబాబూజీ**)

మనకి విజిటర్స్ మరియు పిలిగ్రిమ్స్ అని ఉంటారు. చుట్టంచూపుగా వచ్చి పోయేవాడు యాత్రికుడు, దేవుణ్ణి చుట్టపుచూపుగా చూసి పోయేవాళ్ళు ఉంటారండీ, వాళ్ళకి ఏంటంటే ఆ గుళ్ళోకెళ్ళి అదేదో చూసేస్తే అయిపోతుంది. ఊరికే మనసుకి తృప్తి. మిగిలిందా, పెట్టిందా, అతుక్కుందా ఏమన్నానా? ఏమి అతుక్కుంటుంది? అక్కణ్ణుంచి ఇక్కడికి వచ్చేవరకు లేని దేవుడు ఆ క్షణం మెఱుపు మెరిసినట్టు కనపడ్డట్టు, మనసుకి భ్రమ కల్పించడమే తప్ప, అటుపైన చూసామన్న భ్రమ తప్ప నీలో



అతుక్కున్నదేముంది? నిలబడ్డదేముంది? స్థిరపడ్డదేముంది? అందుచేత యాత్ర అంటే ఎక్కడో మొదలవుతుంది? **నీవు బయలుదేరిన దగ్గర నుండి నీ మనసులో ఆయనే గోచరిస్తూ ఉండాలి, కనపడుతున్న వాళ్ళ రూపంలో ఆయనే గోచరిస్తూ ఉండాలి. అడుక్కునే వాళ్ళ రూపంలోనూ, అమ్ముకునే వాళ్ళ రూపంలోనూ ఆయనే కనపడుతూ ఉండాలి. ఇలా కనపడుతోంది అనుకోండి, అపుడు యాత్ర అవుతుంది అది, లేకపోతే విహారయాత్ర అవుతుంది. విహారయాత్రలో ఏమి చూసుకుంటాం అంటే, తిండి, బట్ట, పడక. యాత్రలో ఉన్నాం అనుకోండి, దైవాన్ని చూసుకుంటూ ఉంటాం. వచ్చి తిరిగి వెళ్ళేంతవరకు దైవాన్ని చూసుకుంటూ యాత్ర చేసుకుంటూ, వచ్చాం అనుకోండి. అపుడు అది విష్ణు ఆరాధన అవుతుంది.** అలా కాకపోతే విష్ణు ఆరాధన చేసాము, అనే ఒక భ్రమ ఉంటుంది. అది మనకి లోపల అతుక్కోవాలిగా? దేనికోసం ఇంత ప్రయత్నం చేసామో, అది సఫలీకృతం కావాలిగా, అరగాలిగా? ఆకలింపు అవ్వాలిగా, తదనుభూతి ఉండాలిగా? అలా ఉండాలంటే ఆ స్ఫూర్తి ఎప్పుడూ ఆ బుద్ధిలోకంలోకి చేర్చి ఉంచాలి. యాత్ర మొదలైన దగ్గర నుంచి యాత్ర అయ్యేంతవరకు.

యాత్రలో ఉండేవాడు ఏం చేస్తాడు? నిరంతరం దైవాన్ని దర్శనం చేస్తూ ఉంటాడు. దైవాన్ని స్మరణ చేస్తూ ఉంటాడు. దైవాన్ని వింటూ ఉంటాడు, చూస్తూ ఉంటాడు, లౌకికమైన విషయములు తగుమాత్రంగా తన కర్తవ్యాన్ని నిర్వర్తిస్తూ ఉంటాడు. అటువంటి వాడికి జీవన యాత్ర అది. అందరికీ జీవనయాత్ర ఉండదు. **'మునగానాం తేలానాం'** అంటూ ఉంటాం చూడండి మనం తెలుగులో, కొంతేదో సంస్కృతం కలిపినట్టుగా, అలా మనకి ఏదో కాసేపు బ్రతుకుతూ ఉంటాం, చచ్చిపోతూ ఉంటాం, అలా ఉంటూ ఉంటాం. ఆ ఉండటం మన ఇంట్లో విష్ణుమూర్తి పటం ఉన్నా పెద్ద ఉపయోగం లేదు దానికి. చూస్తూ ఉంటాడు మన తిప్పలు. "ఏమిరా! నన్ను పెట్టుకున్నా ఇన్ని తిప్పలు పడుతున్నావు నువ్వు? నన్ను పెట్టుకొని నువ్వు తిప్పలు పడాల్సిన అవసరం లేదుగా! నేనేగా అంతాను" అని. ఆ ప్రహ్లాదుని తీసుకెళ్ళి సముద్రంలో ముంచేస్తూ ఉంటే, అతడు అంటాడు సముద్రాన్ని చూసి, ఇది మా అమ్మ పుట్టిల్లు కదా! అని. ఎందుకనీ? ఆయనకి నాన్న విష్ణుమూర్తి కాబట్టి. మనకి అలా ఉండదు. అంత దూరం అక్కర్లేదు మనకి. ఎలాగూ మనని సముద్రంలో ముంచే అంత విపత్కర పరిస్థితులు మనకి లేవు. మనకున్న చిన్న చిన్న పరిస్థితులలోనే మనం చూడలేక పోతున్నాం కదా! ఆ చూడటం, ఈ విశ్వమూ, ఈ విష్ణువూ కలిపి నామ సాధన చేయాలి. ఇది **విశ్వం విష్ణుః విశ్వంబు విష్ణుండు. విష్ణుండు కంటెను వేరే యేమియునూ లేదు. అది భాగవతం, దానితో మొదలవుతుంది.**

**మనం కోరినవి లభించకపోతే దేవుని తెలివిని ప్రశ్నించకుండా ఉండే తెలివి మనకు ఉండాలి.**



అందుచేత ఈ విశ్వమూ, ఈ విష్ణువూ రెండూ రెండు నామాలని మనం ఆకళింపు చేసుకొని, అనుభూతిపరంగా వాటిని తయారు చేసుకోవాలి, దానికి సాధన చేయాలి, అదీ దీక్షగా చేసుకోవాలి గుర్తుపెట్టుకోండి. సహస్రనామాలు చేసేవాళ్ళు, ఏదో ఒక దీక్ష (నియమం) ఉండాలి జీవితంలో వాళ్ళకి. **ఏ దీక్షా (నియమం) లేకుండా ఉంటే రక్షణ ఉండదు. దీక్ష ఉన్న వాళ్ళకి రక్షణ ఉంటుంది**. అది ఏ దీక్ష అయినా కావచ్చు. ఒక్క దీక్ష పట్టండి! నాకు తెలిసిన ఒకాయనకి వచ్చినన్ని కష్టాలు ఈ ప్రపంచంలో ఎవరికీ రాలేదు. ముప్పైరెండు సంవత్సరాల నుంచి చూస్తున్నాను ఆయన్ని. ఆయనకి చిన్నతనంలో వాళ్ళ అమ్మ ఒక దీక్ష నేర్పింది. ఏమిటంటే, "నాన్నా! ప్రతీ సోమవారం తప్పకుండా శివాలయానికి వెళ్ళు. అంతే! ఈ రోజున ఆయనకి డెబ్భై రెండు సంవత్సరాలు. ఆయన పన్నెండు సంవత్సరాల వయసులో మొదలుపెట్టాడు. నాకు ఆయన పరిచయమైంది ముప్పైరెండు సంవత్సరాల క్రితం. అంటే ఆయనకి నలభై సంవత్సరాలు అప్పటికి. సోమవారం వచ్చిందంటే పొద్దున్నగాని, సాయంత్రంగాని ఏదో ఒక సమయంలో శివాలయానికి వెళ్ళడం, అక్కడ దైవాన్ని దర్శనం చేసుకోవడం, తనకి తోచిన ఆరాధన చేయించడం, అది తప్పలేదు ఇవాల్టి వరకు, ఆయనకు వచ్చినన్ని ఉపద్రవాలు ఎవ్వరికీ రానూలేదు. అలా ఎవరికీ తప్పిపోనూలేదు. మీరందరూ పరమానందయ్య శిష్యుల కథ సినిమా చూసేవుంటారు. పుస్తకాలు ఎవరూ చదవరనుకోండి. కనీసం సినిమాల రూపంలో అయినా కొద్ది కొద్దిగా తెలుస్తూ ఉంటాయి. ఆ సినిమాలో మహారాజు ప్రతి ప్రదోషకాలంలో కూడా శివారాధన చేయాలి. ప్రతి ప్రాతఃకాలంలోనూ శివారాధన చేయాలి. అతడు వేశ్యాగృహంలో ఉన్నపుడు, అతడు శివారాధన చెయ్యడానికి ఆ రోజు ఆలస్యం అయిపోతూ ఉంటే, ఆమె వక్షస్థలంలో ఉండే వక్షోజాలను చూసి అదే శివలింగంగా భావించి ఆరాధన చేస్తాడే తప్ప, శివారాధనను మిస్ కొట్టడు. అంటే అంతరాయం కలుగకుండా నిర్వర్తిస్తాడు. అందుచేత అతనిలో ఎన్ని అశుభమైన స్వభావములు ఉన్నా అన్నీ తొలగిపోయి చివరికి శివానుగ్రహానికి పాత్రుడవుతున్నట్లుగా ఆ కథ చూపిస్తారు.

మనం ఏదైనా ఒక్క దీక్ష (నియమం) ఒక్క దీక్ష! ఎందుకంటే దీక్ష మనిషిని ఒక ధర్మానికి కట్టివేస్తుంది. నువ్వు పెట్టుకున్న దీక్ష వల్ల, నీ అంతట నీవుగా ఒక ధర్మానికి బద్ధుడవవుతావు. అది నువ్వు నిర్వర్తిస్తున్నంతకాలం నీకు రక్షణ వస్తూ ఉంటుంది. ధర్మో రక్షతి రక్షితః ధర్మాన్ని మనం రక్షిస్తే, ఆ ధర్మం మనల్ని రక్షిస్తుంది.

– *'మాస్టర్ పార్వతీకుమార్ గారి'* ప్రవచనం నుండి.



**ప్రకృతి మనకు కావలసినవే చక్కగా నిర్ణయించి ఇస్తుంది.**

## STORY ABOUT SEEING THE POSITIVE IN EVERYTHING



***Guruji:***

When you forgive, then, if at all you do a mistake, the other people also forgive you. These are simple things that we have to learn. These are not very great spiritual sadhanas. They are just practicalities. The art of living. Living harmoniously, positively. Not always complaining, seeing the negativity in the people, "He has done like that..." Bhagavan, everyday that he sees the positive, so much so, that it so happened that in Tiruvannamalai there was a bandit, a rowdy, a gangster, and he used to harass people like anything. In those days there were no houses between the town and the ashram. The ashram was almost far away. And, after 7 o'clock, the ladies and people were afraid to go to the town, because in the beginning days, ladies were not allowed to stay in the ashram, they had to go back to the town. And this man used to harass the ladies and those people who were going round the hill, taking money from them. He was almost a terror in the town. One day it so happened that the great villain, he passed away. And everybody in the ashram was almost celebrating his death. "Oh, he has died. He's gone! The curse has been removed from the town." And then everyone was talking in a jubilant manner. "Have you heard the good news? That man has died!" Like that. And, they were so much engrossed in their talk, that even infront, in the presence of Bhagavan, they started talking amongst themselves. Usually in India, it is disrespectful to be engrossed in their own talk in front of a saint. They were so engrossed, because it was such good news for them. And they started telling the stories. "Oh, that man has done like that to that woman the other day. Oh, he has pick pocketed that man. He has manhandled that man." Like that they were telling their experiences, sharing their experiences. They were all narrating their leelas. And after the whole thing, the whole narration and everything had subsided, then it was Bhagavan's turn to participate in the whole discussion. Then he said, "Maybe it is all true, but he used to be very clean. He used to take bath thrice a day." Perhaps that is the only good quality in him, and he pointed it out, and then he kept quiet. See in such a thing also, how he saw the positive thing. A person who is always trying to see something beautiful, glorious - why should his eyes fall on something ugly? Even in such a person he used to see... even though that is a very insignificant good quality - taking bath thrice a day and keeping himself clean. And

he knew it, and he pointed it out and kept quiet. That is one of the wonderful characteristics which expresses from Bhagavan.



**సత్సంగ వార్షికోత్సవాల లక్ష్యమేమిటి?**

**భక్తుడు :** ఒక సత్సంగ వార్షికోత్సవంగాని, మందిరం వార్షికోత్సవంగానీ ఎట్లా జరుపుకుంటే మీకు ఇష్టం? ఏ విధంగా ఉండాలి? ఎలా చేసుకోవాలి?

**గురువుగారు :** వార్షికోత్సవమంటే ఏంటయ్యా? ఎప్పుడూ జరిగేటువంటి సత్సంగాన్ని కొంచెం పెద్ద ఎత్తున చేస్తున్నాం. రెగ్యులర్‌గా వచ్చేవాళ్ళే కాకుండా, కొంచెం ఆసక్తి ఉండేటువంటి వాళ్ళని కూడా పిలిచి కొంచెం పెద్ద ఎత్తున జరిగేటువంటి షేరింగ్ అని అర్థం. అంతకుమించి ఏముంది చెప్పు? రోజూ భోజనం చేస్తాం. ఎవరైనా ఫ్రెండ్స్‌గాని, బంధువులుగాని వచ్చినపుడు, ఇంకొంచెం పెద్దఎత్తున చేసుకొని భోజనం చేస్తాం. అదీ భోజనమే. కొంచెం పెద్ద ఎత్తున జరిగే భోజనం. కాబట్టి వార్షికోత్సవమంటే కొంచెం పెద్ద ఎత్తున జరిగేటువంటి సత్సంగం అని అర్థం. **బాబా స్మరణ, పారాయణ, బాబాపట్ల మనకు ఉండేటువంటి అనుభూతిని పదిమందితో పంచుకోవడం ఇవి. ఈ మూడే జరగాలి వార్షికోత్సవంలో.** అక్కడ సత్సంగాలు చేసేటువంటివాళ్ళు ఎవరైనా ఉంటే మనం ఏమేమి చేసుకున్నాము. మనం ఈ సత్సంగాలు చేసేటపుడు మనలో ఎక్కడైనా ఈ అహంకారంగాని, ఈ ప్రలోభాలు కానీ, ఈ టెంప్టేషన్స్‌గానీ ఏమైనా పెరిగాయా? మనం సరైనటువంటి సాయిపథంలో పోతున్నామా? లేదా? ఈ సంవత్సరంలో మన ప్రోగ్రెస్ ఏమిటి? అని, మన ప్రోగ్రెస్‌ని బేరీజు వేసుకొని, మనం ఏమైనా తప్పులు చేస్తుంటే ఒకరికొకరు జ్ఞాపకం చేసుకోవాలి అనే నిర్ణయం తీసుకొని, ఒకరినొకరు హెచ్చరించుకోవాలి అని అనుకొని, నెక్స్ట్ ఇయర్ నుంచి అవి చెయ్యకుండా పోదామనేదానికి ఒక మీటింగ్ లాంటిది, అలా చేసుకోచ్చు. **అది ఆర్భాటానికి, ఆడంబరానికి చిహ్నం కాకూడదు.**

**సాయిపథగాముల సాధనలో పౌర్ణమి, గ్రహణాలు, గురువారాలకు ఎంత ప్రాముఖ్యత ఉంది?**

**గురువుగారు :** నేను తిరువణ్ణామలైలో ఉండేటపుడు మనవాళ్ళు పర్మిషన్ అడిగేవాళ్ళు. మేము వస్తాం తిరువణ్ణామలైకి అని. అక్కడ తిరువణ్ణామలైలో, పూండీలో కూడానూ పౌర్ణమి చాలా ఇంపార్టెంట్. కొన్ని వందలమంది, వేలమంది ప్రదక్షిణలు చేసుకుంటారు. ఆ వచ్చేదేదో... వేలమందిలో వీళ్ళు కూడా కలసిపోతారు చక్కగా, వాళ్ళు నామం చేసుకుంటూ పోయినా కూడా వేలమందిలో అందరికీ వినిపిస్తుంది. అన్ని వేలమంది బాబా నామం వింటారు అనే ఉద్దేశ్యంతో, పౌర్ణమికి రండి. వచ్చి



**ప్రమాదాన్ని మోదంగా మలచుకోవడం మనం నేర్వవలసిన పని.**



చక్కగా బాబా ఫోటో పెట్టుకొని, గిరి ప్రదక్షిణ చేసుకొని, నామం చేసుకోండి అని చెప్పాను. ఎప్పుడు? పది, పన్నెండేళ్ళవుతుంది అది చెప్పి. అది తిరువణ్ణామలైలో అక్కడుండే పరిస్థితులకు సరిపోయినట్టు. అంతే. అయిపోయింది. ఆ తరువాత నుంచి గురువుగారికి పౌర్ణమి అంటే చాలా ఇంపార్టెంట్. పౌర్ణమిరోజున స్పెషల్ పూజలు చేసుకోమంటారు. స్పెషల్‌గా ధ్యానం చేసుకోమంటారు అనడం స్టార్ట్ అయ్యింది. నాకు పౌర్ణమి ఇంపార్టెంట్ కాదు, అక్కడ పౌర్ణమి ఇంపార్టెంట్ కనుక!

**భక్తుడు :** జనరల్‌గా పౌర్ణమికి ప్రిఫరెన్స్ ఉండదా సార్?

**గురువుగారు :** అన్ని రోజులకీ ప్రిఫరెన్స్ ఉంది. చేసుకుంటే అన్ని రోజులు మంచివే. పౌర్ణమి ఏంటనంటే... మంచి ఆహ్లాదకరంగా ఉంటుంది. మంచి వెన్నెల, మనసు కూడా చక్కగా ఉంటుంది. చక్కగా ధ్యానం కుదురుతుంది. అది వేరే విషయం. అంతవరకే తప్పితే, మనసు మీద ఏదైనా ప్రభావాలుంటాయా అంటే, ఈ చిన్న చిన్న అకేషన్స్ మనల్ని ఏం చేస్తాయి చెప్పు? మనకు దానికి మించిన పౌర్ణములు ఇక్కడున్నాయి. మంచి తెల్లటి బట్టలు వేసుకుంటే, క్రింద ఎక్కడ కూర్చున్నా మాసిపోతుంది. మనదేమిటి? నేల మాసిపోవాల్సింది తప్పితే, మనకేమీ ఆ ఇబ్బందులు లేవు. కాబట్టి పౌర్ణములు, ఇవేవీ మనల్నేమీ చేయలేవు. కాబట్టి ప్రతిరోజూ మనకు పౌర్ణమే. కాకపోతే ప్రతిరోజూ అమావాస్యే.

**భక్తుడు :** కాబట్టి, దానికి అంత ప్రయారిటీ ఇచ్చి చూడాల్సిన అవసరమేమీ లేదన్నమాట.

**గురువుగారు :** ఏం లేదు, కాబట్టి, ఎందుకది చెప్తున్నానంటే ఈ శని, ఈ చంద్రుడు, ఈ సూర్యుడు... ఇవి మనల్ని ఏం చెయ్యవు. వీటన్నింటికంటే పవర్‌ఫుల్‌గా ఉండేటువంటి సద్గురువు మనకు ఉన్నారు అది గుర్తుపెట్టుకుని, ఎప్పుడైనా మనం దానిని గుర్తుపెట్టుకుంటే చాలుగా, ఏ రోజు మంచిది, ముహూర్తం మంచిదా, పౌర్ణమిరోజు ధ్యానం చేసుకుంటాము... ఆఖరికి బాబా గురువారాన్నే అంగీకరించలేదు. “ఏం గురువారమైతే” అన్నారు. నిజంగా గురువారమైతే ఏంటి? గురువారానికి, బాబాకు ఏంటి సంబంధం? నిజానికి ఏమీ లేదు. వారాలన్నింటిలో కూడాను గురువు పేరుతో ఉండేది అది. ఆయన సద్గురు స్వరూపుడు. అందుకని అందరి సద్గురువుల యొక్క వాళ్ళు... వాళ్ళకు సంబంధించిన ముఖ్యమైన రోజొకటి... రోజు ఉపవాసం ఉండలేరు కదా, అందుకని ఒకరోజు ఉందాములే అనుకుంటారు. ఏ రోజు ఉండాలి? గురువుకు సంబంధించినది కనుక గురువారం. అంతే, దాంట్లో ఉండేది. అంతే తప్పితే, మనం గురువారమే చేసుకోవాలని కాదు. అది



మామూలు కామన్ వ్యక్తి చేసుకునేటువంటిదది. ఏదో ఆచారాలు, ఉపవాసాలు పెట్టుకుంటూ చేసుకోవాలనుకునే వాళ్ళకు గురువారాలు. మనకు ప్రతిరోజూ గురువారమే. ప్రతిరోజూ పౌర్ణమే చేసుకోగలిగితే! కాబట్టి పౌర్ణమి, ఇవి మానెయ్యండి. మనకు బుద్ధి పుట్టినపుడు, బాబా ధ్యానం చేసుకోవాలి .

**భక్తుడు :** ఇప్పుడు ఈ గ్రహణం పట్టిన రోజుల్లో, మరి మనకు అదేమీ ఉండదా?

**గురువుగారు :** ధ్యానం బాగా కుదురుతుంది. ఆ టైమ్‌లో ఉండేటువంటి... మామూలుగా బాగా ఎక్కువ ధ్యానం చేసుకునేటువంటి వాళ్ళకి, ఆ రోజు ఇంకా డీప్‌గా కుదురుతుంది. పౌర్ణమి రోజున ఎఫెక్ట్ ఉంది. ఎఫెక్ట్ లేదనడం లేదు. ఎంతవరకు అంటే, అంతవరకే. కానీ అది అబ్సెసివ్ (Obsessive) కాకూడదు. పౌర్ణమి ఇంపార్టెంట్, పౌర్ణమి రోజున ఫలానా దగ్గరకు పోవాలి, పౌర్ణమి రోజున స్నానాలు చేయాలి. ఆ రోజున సముద్ర స్నానాలు చెయ్యాలి... గ్రహణం రోజున గ్రహణం విడువగానే స్నానం చేయాలి, గ్రహణం ముందు అన్నం తినకూడదు. ఆ తరువాత అన్నం తినకూడదు, ఇవి కరెక్ట్ కాదు. దాంట్లో **'అంటు'** ఏమీ లేదు. **అంటేమిటి**? సూర్యుడికి నీడ పడితే మనకేంటి అంటు?

**భక్తుడు :** అసలు ఇదెందుకు వచ్చింది సార్? గ్రహణం ముందు అన్నం తినకూడదు అని.

**గురువుగారు :** ఆ రోజుల్లో వాళ్ళకు అర్థం కాక. సూర్యుణ్ణి ఎవరో రాహువో, కేతువో వచ్చి మింగేస్తుంది అని ఆబాలగోపాలం అనుకునేవాళ్ళు. సూర్యుడు దేవుడు కనుక, ఆయనకొక కీడు జరిగింది కనుక, ఎవరికైనా కీడు జరిగితే మనకు మైల సోకుతుంది అంటాము కనుక ఆయనే మైలపడ్డాడు కనుక, మనం కూడా మైల తీర్చుకుంటాము అని మూఢనమ్మకాలుగా వచ్చాయి. అంతకుమించి మైలా లేదు, అంటూ లేదు. వాళ్ళకు ఆ ప్రకృతి, ఇవీ అర్థమయ్యేవి కాదు. ఏదో విచిత్రం జరుగుతోందక్కడ అని అనుకునేవాళ్ళు. ఆ విచిత్రాన్ని ఇంటర్‌ప్రెట్ చేసే దాని కోసంగా కథలు వచ్చాయి. తెలిసిన వాళ్ళు చెప్తూనే ఉన్నారు. అవి ఛాయాగ్రహాలు అని! అది వేరే విషయం. రాహువు, కేతువు అనేటువంటివి అవేమీ రాక్షసులు కాదురా, ఛాయాగ్రహాలవి అని చెప్పారు. చెప్పడానికి మాత్రం. కానీ అది ఆబాలగోపాలానికి అర్థమయ్యేది కాదు. ఛాయ ఏమిటి? గ్రహం ఏమిటి? అది అర్థం కాదు కదా. అందుకు రాహువూ, కేతువు అన్నారు.

**భక్తుడు :** ఛాయాగ్రహం అంటే ఏమిటి సార్?

గురువుగారు : నీడ. నీడ పడేటువంటిది. యాక్చువల్‌గా దానికి ఎంటిటీ లేదు. చంద్రుని యొక్క



**ప్రతి రేయి చిరునవ్వుల చిరుదీపాలు వెలుగుతున్న ఇళ్లలో నిత్య దీపావళే కదా!**



నీడ దాని మీద పడ్డప్పుడు వచ్చేటువంటిదాన్ని... ఆ గ్రహమక్కడ దానికేమీ అడ్డం రావడం లేదు, నీడ మాత్రమే పడుతుంది.

**భక్తుడు :** ఇవన్నీ ఒకదానికొకటి అడ్డమొచ్చినపుడు

**గురువుగారు :** అడ్డమొచ్చినపుడు నీడ పడటం వల్ల జరిగేటువంటిది. కాబట్టి ఆ నీడ ఆయన మీద పడుతుంది కనుక. అది ఛాయాగ్రహం. మనం చూసేది నీడనే కదా!

**భక్తుడు :** మనం చూసేది యాక్చువల్‌గా డిసెప్పియర్ అవడం చూస్తాం.

**గురువుగారు :** ఏదైనా సరే, అక్కడేమీ ఎంటిటీ లేదు.

**భక్తుడు :** ఎంటిటీ ఉండదు.

**గురువుగారు :** కాబట్టి దానిని వాళ్ళు ఛాయాగ్రహం అన్నారు.

**రమణమహర్షి చెప్పిన "నీవెవరో తెలుసుకో" అనే మాటను ఎలా అర్థం చేసుకోవాలి?**

**గురువుగారు :** రమణమహర్షి యొక్క టీచింగ్ ఏమిటి అని మనం అర్థం చేసుకోవాలనంటే... ఆయన ఎందుకు అరుణాచలం వచ్చారు? ఆయన యొక్క అనుభవం ఏమిటి? ఆయన అరుణాచలాన్ని ఎట్లా చూసారు? దీన్ని బట్టి ఆయన యొక్క హృదయం ఏమిటి అనే విషయం మనకు అర్థమవుతుంది. ఎవరో వచ్చి వేదాంతం మీద ప్రశ్న వేసారు. ఆ వేదాంతం ప్రశ్నకి ఆయన సమాధానం చెప్పారు. ఈ సమాధానాన్ని బట్టి జడ్జ్ చేయకండి అని నేను చెప్పింది. ఎట్లాగా? ఉదాహరణకు ఆయన, **"నీవెవరో తెలుసుకో! అదే చాలు. అదే మార్గం"** అన్నారు. తెలుసుకుంటే అది ఆత్మ సాక్షాత్కారం అవుతుంది అన్నారు. ఈ ఆత్మ ఎటువంటిది? ఏ స్థానంలోనూ లేదది. మనలోనే ఉంది. మరి అయినపుడు ఆయన మధురై వదలిపెట్టి అరుణాచలానికి ఎందుకు వచ్చారు? మధురైలో ఆత్మ లేదా? ఆయనకు ఆత్మసాక్షాత్కారమైనది మధురైలోనే. అరుణాచలంలో కాదు. మరి అయినపుడు, అరుణాచలానికి రావాల్సిన అవసరం ఏమొచ్చింది? ఆయన చెప్పిన మాట ప్రకారంగా చూసినట్లయితే ఆయన రావాల్సిన అవసరం లేదు. కాబట్టి వచ్చారు అంటే, ఎందుకొచ్చారు అని ఆలోచించండి. ఆయన చెప్పినటువంటి ఆత్మ యొక్క లక్షణాలేమిటి? ఆయన ఎట్లా దాన్ని వ్యక్తం చేసారు? దీన్ని బట్టి రమణమహర్షి యొక్క హృదయం ఏమిటి అనే విషయం మనకు అవగాహన కావాలి అని చెప్పాను. అదీ నేను చెప్పింది.

**భక్తుడు :** అంటే మీరు మొన్న చెప్పినపుడు మేము అర్థం చేసుకున్నదేమిటంటే, రమణమహర్షి



"హూ యామ్ ఐ" **(Who am I)** అన్నదాన్ని గురించి ఎన్‌లైట్‌ఎన్డ్ **(Enlightened)**గా చెపుతూ, ఆయన మటుకు హోమం పెట్టుకోవడం, అరుణాచలేశ్వరా, అరుణాచలేశ్వరా అని అనడం అవన్నీ జరుగుతున్నాయి. అయితే ఆయన చెప్పింది, ప్రాక్టికల్‌గా ఆయన ఉన్నది డిఫరెంట్ కాబట్టి, వాళ్ళు చెప్పినదాని కన్నా కూడా వాళ్ళు ఏ రకంగా జీవించారనేది మనం తీసుకునేటట్లయితే ఆయన జీవించిన విధానం మటుకు.....

**గురువుగారు :** అది కాదు నేను చెప్పింది

**భక్తుడు :** అది కాదా సార్...

**గురువుగారు :** అట్లా వచ్చారనంటే దాని వెనుక ఏమై ఉండాలి అని ఆలోచించండి అని అంటాను. "హూ యామ్ ఐ" అని అనేటట్లయితే మరి రమణమహర్షి అట్లా లేరు కదా? మరి అట్లా ఆయన ఎందుకన్నారు? ఆయన చెప్పిన దానికి భిన్నంగా ఉన్నారనడం కాదు. భిన్నంగా కూడా లేరు. ఈ ప్రశ్న గురించి సమన్వయపడని దాని గురించి ఆలోచించండి అని చెప్పాను నేను. అపుడు మీకు సరైనటువంటి రమణమహర్షి యొక్క హృదయం అర్థమవుతుంది. నేను చెప్పదలచుకున్నది ఏమిటనంటే, "హూ యామ్ ఐ" అనేది ఆయన చెప్పినటువంటి పద్ధతి కాదు అని చెప్పదలచుకున్నాను. మీరు ఆయన చెప్పింది "హూ యామ్ ఐ" అని అర్థం చేసుకోవడంతో గొడవంతా. నేను చెప్పదలచుకున్నది ఏమిటంటే, రమణమహర్షి చెప్పింది వేరే ఏదో ఉంది. వేరే ఏదో ఉంది అని చెప్పేదానికి... ఇదిగో, ఈ ఈ కారణాల ద్వారా, వేరే ఏదో ఉండి వుండవచ్చునని మనకు అనుమానం తోస్తోంది. కాబట్టి అదేదో తెలుసుకోండి అని చెపుతున్నాను. ఆయన అనేవారు... క్లోజ్‌గా ఉండే భక్తులందరికీ ఒక విషయం మాత్రం చెప్పేవాళ్ళు. ఈ "హూ యామ్ ఐ" అనే విషయం వస్తే మాత్రం, ఆయన బ్రహ్మాస్త్రం అనేవాళ్ళు అందరూ. వచ్చి ఊరికనే వేదాంత ప్రశ్నలు వేసి, ఇప్పుడిట్లా చెత్త ప్రశ్నలేసి విసిగిస్తుండేవాళ్ళు. ఇట్లా సమాధానం చెప్పేవారు కాదాయన. అందుకని వీళ్ళని వదిలించుకొనేదానికి ఆయన పద్ధతి ఏంటనంటే, "ఆ ప్రశ్న వేసే వాడెవరో తెలుసుకో" అని చెప్పేసి కొట్టిపారేసేవారు అంతే. అందుకని ఏంటనంటే బాగా సన్నిహితంగా ఉండేటువంటి డివోటీస్ మాత్రం ఏదైనా విషయం ఆయన్ను అడగాలంటే మాత్రం ముందు ఆయన దగ్గర ప్రామిస్ తీసుకునేవాళ్ళు. భగవాన్! మీరు బ్రహ్మాస్త్రం ప్రయోగించనంటే మాత్రం అడుగుతాం మేము అని. సరే, సరే చెప్పు, నువ్వు చెప్పు అనేవారు. అప్పుడు వీళ్లడిగితే, ఆయన ఎక్స్‌ప్లయిన్ చేసి చెప్పేవారు. **– సాయిపథం, శ్రీబాబూజీ**



**ప్రార్థన అంటే పొడవైన కోరికల చిట్టాకాదు.**



# ఉద్బోధన్, జయరాంబాటిలలో శ్రీ శారదామాత

శ్రీరామకృష్ణుల ప్రధాన శిష్యులలో చాలా తక్కువ మంది మాత్రమే శారదామాత వద్దకు స్వేచ్ఛగా వెళ్ళి ఆమెతో చనువుగా మాట్లాడగలిగేవాళ్ళు. యోగానందస్వామి 1899లో చనిపోయేవరకు, శారదామాత సంరక్షణ బాధ్యతను వహించారు. అటు తర్వాత ఆమె సంరక్షణా బాధ్యతను త్రిగుణాతీతానంద స్వామి చేపట్టారు. త్రిగుణాతీతానందస్వామి అమెరికాకు వెళ్ళిపోయాక ఆ బాధ్యతలను శారదానందస్వామి స్వీకరించారు. శారదామాత 1920వ సంవత్సరంలో దేహత్యాగం చేసే వరకు ఆమె బాధ్యతను శారదానందస్వామియే నిర్వహించారు. ఇటు కలకత్తాలోగాని, అటు అమ్మపుట్టిల్లు జయరాంబాటిలోగాని అమ్మకు ఒక నివాసం అంటూ ఏదీ లేకపోవడం చూసి, శారదానందస్వామి ఎంతో బాధపడ్డారు. అమ్మ కలకత్తాకు వచ్చినప్పుడు అద్దెయింట్లోగాని, లేదా ఎవరైనా భక్తుని ఇంట్లోగాని నివసించేది. జయరాంబాటిలో ఉన్నప్పుడు ఆమె తన తమ్ముడి కుటుంబంతో కలిసి ఉండేది. ఇట్లా మరొకళ్ళ ఇంట్లో ఉండవలసిరావడం వల్ల, ఆమెకు తన ఆధ్యాత్మిక గురుత్వం ప్రకటించడానికి సరియైన వీలు, అవకాశం ఉండేదికాదు. అమ్మకు ఒక ఇంటిని నిర్మించాలి, ఆ ఇల్లు ఉద్బోధన్ పత్రికా కార్యాలయంగా కూడా ఉపయోగపడాలి – ఇందుకోసం, సన్యాసి అయ్యుండి కూడా శారదానంద స్వామి (స్వంత బాధ్యతమీద) అప్పుచేసి, డబ్బుతెచ్చి ఒక ఇల్లు కట్టించారు. ఈ రెండతస్తుల భవంతే నేడు 'ఉద్బోధన్' లేక 'మాతృ గృహం'గా పిలవబడుతోంది. ఉద్బోధన్ పత్రిక ముద్రణాకార్యాలయం 1908వ సంవత్సరం చివరిలో ఈ క్రొత్త భవంతిలోకి మారింది. శారదామాత 1909వ సంవత్సరం మే 23న ఈ ఇంట్లోకి ప్రవేశించారు. కొన్ని సంవత్సరాల తర్వాత, శారదానంద స్వామి అమ్మకోసమని జయరాంబాటిలో కూడా ఒక ఇల్లు కట్టించారు.

ఒకసారి దివ్యజనని శారదాదేవి యిట్లా అన్నారు "శరత్ అక్కడ ఉన్నంత వరకే నేను ఆ ఉద్బోధన్‌లో ఉండగలను. అతడి తర్వాత నా బాధ్యత వహించగల్గినవాళ్ళు ఎవ్వరూ నాకు అక్కడ కనిపించలేదే. అన్ని విషయాల్లోను నా బాధ్యతను వహించడానికి ఒక్క శరత్ మాత్రమే సమర్థుడు. నా బరువు బాధ్యతలను అతడొక్కడే సక్రమంగా చేపట్టగలడు" పదహారు సంవత్సరాలపాటు 1904 నుండి 1920 వరకు అనేక రకాలైన కార్యకలాపాలలో ఒక ప్రక్క తలమునకలయి ఉంటూ, ఇంకొకప్రక్క రామకృష్ణ మఠం, మిషనులకు సంబంధించిన నిర్వహణలో ఎదురయ్యే గురుతరమైన విధులు నిర్వహిస్తూ ఉన్నప్పటికీ, శారదానందస్వామి మాత్రం శారదాదేవికి సేవలు చెయ్యడంలో త్రికరణశుద్ధిగా పాటుపడ్డారు.



ఆమెకు (ఒక్కరికే) సేవలు చెయ్యడమే కాదు, ఆమె బంధువుల యోగక్షేమాలను కూడా శారదానందస్వామి ఎంతో జాగ్రత్తగా కనిపెట్టి చూసేవారు. మరణానికి చేరువలోనున్న శారదామాత చిన్న తమ్ముడికి ఆయన సేవలొనరించారు. అమ్మ మేనకోడలు అయిన రాధూకి భవిష్యత్తులో ఆర్ధికపరమైన ఇబ్బందులేవీ కలగకుండా శారదానందస్వామి తగిన కట్టుదిట్టాలు చేశారు. అమ్మ అనేకసార్లు తీర్థయాత్రలకు వెళ్ళింది. ఆ తీర్థయాత్రలలో చాలా వాటిలో, శారదానందస్వామి అమ్మను అనుసరించి వెళ్ళారు. జయరాంబాటిలో అమ్మ ఉన్నప్పుడు శారదానందస్వామి అనేకసార్లు ఆమెను దర్శించారు. జయరాంబాటిలో అమ్మ జబ్బుపడినప్పుడు శారదానందస్వామి వెళ్ళి ఆమెకు పరిచర్యలు చేశారు.

శారదానందస్వామి తాను కలకత్తాలో ఉన్న సమయంలో శారదామాత అవసరాలను ఆయనే స్వయంగా కనిపెట్టి చూసేవారు. ఆమె బయటకు ఎక్కడకు వెళ్ళాలన్నా ఆమెకు కావలసిన అవసరాలను తీర్చడంలోను, ఆర్ధిక సదుపాయాన్ని సమకూర్చడంలోను శారదానందస్వామి ఎంతో శ్రద్ధ వహించేవారు. అమ్మపట్ల శారదానందస్వామి ప్రకటించిన భక్తితత్పరత, రామకృష్ణ వ్యవస్థలో ఒక ఇతిహాసంగా మారింది. తనను వేయిపడగలు విప్పి కాపాడాడనే దృష్టితో, అమ్మ శారదానందస్వామిని పురాణాలలోని వాసుకి సర్పంతో పోల్చేది. “ఎక్కడ వాన కురిసినాసరే, నన్ను కాపాడటానికి అతడు తన గొడుగు తెరిచి పట్టుకుంటాడు” అని అమ్మ తనపట్ల శారదానందస్వామి చూపించే అపరిమిత శ్రద్ధను గురించి ముచ్చటగా వ్యాఖ్యానించేది. శారదాదేవికి స్వామి చేసిన చిరస్మరణీయమైన సేవలలో ముఖ్యమైన వాటి గురించి నిఖిలానందస్వామి ఈ విధంగా పొందుపరచివున్నారు.

శారదాదేవికి, ఆమె వెర్రిమొర్రి చుట్టాలకు సేవలు చేయడమంటే మాటలు కాదు. అది ఎంతో కష్టమైన పని, చాలా సున్నితమైన వ్యవహారం. శారదాదేవియే స్వయంగా ఇట్లా వెల్లడించారు. “శరత్ బ్రతికున్నంతవరకు నాకు ఏ కష్టమూ కలుగదు. నా బరువు బాధ్యతలను సక్రమంగా నిర్వహించగలవాళ్ళు అతను తప్ప మరొకళ్ళు ఎవరూ నాకు కనిపించటం లేదు”. శారదానంద స్వామి కలకత్తాలో లేని సమయంలోగనక, ఎవరైనా శారదాదేవి కలకత్తాకు వెళ్ళే విషయాన్ని ప్రస్తావిస్తే, ఆమె ఇట్లా అనేది “శరత్ లేనప్పుడు కలకత్తాకు వెళ్ళడం అనేది నేను ఆలోచించనే లేదు. నేను కలకత్తాలో ఉన్నప్పుడు, శరత్ బయటకు ఎక్కడికయినా కొద్దిరోజులపాటు వెళ్ళాలనుకుంటే నేను అతడితో ఈ విధంగా చెప్పేదాన్ని “నాయనా! కొద్ది రోజుల పాటు ఆగు. ముందుగా ఇక్కడ నుంచి



నన్ను వెళ్ళిపోనీ. అటు తర్వాత నువ్వు బయటకు వెళుదువుగాని". శారదాదేవికి ఉత్సాహం కలిగించడం కోసం అప్పుడప్పుడు శారదానందస్వామి పాటలు కూడా పాడుతూ ఉండేవారు. బాగా ఎక్కువగా జ్వరం వచ్చి అమ్మ ఒళ్ళు కాలిపోతుంటే, శారదానందస్వామి అమ్మ అరచేతుల్ని ఆచ్ఛాదనలేని తన వంటిమీద అద్దుకొని, ఆ వేడిని తాను గ్రహించడం ద్వారా ఆమెకు ఉపశమనం కలిగించేవారు. శారదామాతకు స్వామిపై పరిపూర్ణమైన నమ్మకముంది.

శారదానందస్వామి తనను తాను 'అమ్మ ఇంటి ద్వారపాలకుడు'గా అభివర్ణించుకునేవారు. ఆ 'పదవి' ఆయనకు ఎంతో గర్వకారణంగా ఉండేది. అమ్మ ఉన్నచోటికి వెళ్ళేదారిలో, క్రింద ఎడమప్రక్కగా ఒక చిన్న గదిలో ఆయన ఉండేవారు. తానున్న ఆ చిన్నగదిలోనుంచి, ఆయన అమ్మకు నమస్కరించి రావడానికి మేడమెట్లెక్కి పైకివెళ్ళే వారినందరిని ఒక కంట శ్రద్ధగా కనిపెట్టి చూస్తూ ఉండేవారు. ఈ పని అంత తేలికయినది కాదు. ఒకసారి భక్తుడొకడు ఎంతో దూరాన్నుంచి మండుటెండలో ఉద్బోధన్‌కి వచ్చాడు. అప్పుడు సమయం మధ్యాహ్నం మూడు గంటలయింది, శారదాదేవి ఒక భక్తురాలి ఇంటి నుంచి అప్పుడే తిరిగివచ్చి విశ్రాంతి తీసుకుంటోంది. శారదానందస్వామి ఆ వచ్చిన భక్తుడితో ఇట్లా చెప్పారు. "శారదాదేవి బాగా అలసిపోయి ఉన్నారు. నువ్వు ఇప్పుడు పైకి వెళ్ళి ఆమెను చూడటానికి నేను అనుమతించను". అది విని ఆ భక్తుడు "ఆమె నీ ఒక్కడికే అమ్మ అవుతుందా? నాకు మాత్రం అమ్మకాదా?" అంటూ శారదానందస్వామిని ప్రక్కకు నెట్టి వేసి, మెట్లెక్కి పైకివెళ్ళి, శారదాదేవిని దర్శించాడు. అయితే వెంటనే అతడు తన దుందుడుకు చర్యకు ఎంతగానో పశ్చాత్తాపం చెందాడు. మెట్లు దిగి క్రిందకు వెళ్లేటప్పుడు తాను స్వామి కంటపడకుండా ఉండాలని, అతడు భగవంతుణ్ణి ఎంతగానో ప్రార్థించాడు. తన అనుచిత ప్రవర్తనను ఆ భక్తుడు శారదాదేవికి విన్నవించుకున్నాడు. శారదాదేవి 'ఫరవాలేదులే' అంటూ అతణ్ణి అనునయించింది. ఆ భక్తుడు చడీచప్పుడు కాకుండా నెమ్మదిగా క్రిందకు దిగివచ్చాడు. అయితే శారదానందస్వామి అదేచోట కూర్చుని అతనికి అగుపించారు. తన అకృత్యాన్ని మన్నించవలసిందిగా అతడు శారదానందస్వామిని వేడుకున్నాడు. శారదానందస్వామి అతన్ని మనసారా కౌగలించుకుంటూ "నన్ను బాధపెట్టావని నువ్వు ఎందుకు అనుకోవాలి? ఇంతటి ఆవేదనాపూరితమైన వ్యాకులత లేనిదే, ఎవరైనా అమ్మను దర్శించుకోగలరా" అన్నారు.



ఇంకొక సందర్భంలో ఈ విధంగా జరిగింది. అప్పుడు అమ్మకు ఆరోగ్యం సరిగాలేదు. ఒక భక్తుడు వచ్చి తనకు మంత్రదీక్ష ఇవ్వమని అమ్మను అడిగాడు. కొన్ని రోజులైన తర్వాత రమ్మని అమ్మ ఆ భక్తుడికి చెప్పింది. కాని అతడు మాత్రం తనకు ఆ రోజే, అప్పుడే మంత్రదీక్ష కావాలని పట్టుపట్టాడు. అప్పుడు అమ్మ అతన్ని వెళ్ళి శారదానందస్వామిని కలుసుకొని మంత్రదీక్ష విషయం ఆయనతో మాట్లాడమని చెప్పింది. "మిగిలిన వాళ్ళెవరూ నాకు తెలియదు" అంటూ ఆ భక్తుడు మొరాయించాడు. "నేను మీ దగ్గరకు వచ్చాను. మీరే నాకు మంత్రదీక్ష ఇవ్వాలి" అంటూ మంకుపట్టు పట్టాడు. అప్పుడు శారదాదేవి అతడితో "నువ్వు ఏం మాట్లాడుతున్నావు? శరత్ అంటే నా శిరోరత్నం. అతడేమి చెబితే అదే జరుగుతుంది" అని స్పష్టం చేసింది. దానితో ఇక చేసేది ఏమీలేక ఆ భక్తుడు శారదానందస్వామి వద్దకు వెళ్ళాడు. స్వామి అతడు మంత్రదీక్షను పొందడానికి ఒకరోజు నిర్ణయించారు.

తనపట్ల శారదాదేవికి అపారమైన నమ్మకం, ప్రేమ ఉన్నప్పటికీ, శారదానందస్వామి మాత్రం ఎల్లప్పుడూ వినయానికి ప్రతిరూపంలో మసలుకునేవారు. శారదాదేవి భక్తులొకరు ఒకరోజున శారదానందస్వామి పాదధూళిని తీసుకున్నారు. అప్పుడు స్వామి అతనితో "ఎందుకు యింత ఘనంగా నమస్కారం చేస్తున్నావు? దీని వెనుక నీ ఉద్దేశ్యం ఏమిటి?" అని నిలదీశారు. దానికతడు "అయ్యా! మీరు అట్లా మాట్లాడతారేమిటి? నేను మీకు కాక మరి యెవరికి నమస్కరించను?" అన్నాడు. అది విని శారదానందస్వామి ఇట్లా అన్నారు "ఎవరి ఆశీస్సులనయితే నువ్వు అందుకున్నావో, ఆమె అనుగ్రహం కోసం నిరీక్షిస్తూ నేను ఇక్కడ కూర్చున్నాను. ఆమె గనుక తలచుకుంటే, ఈ క్షణంలోనే నేను కూర్చున్న స్థానంలో నిన్ను కూర్చోబెట్టగలదు". **శారదానందస్వామి అమ్మ ముందు సాష్టాంగ నమస్కారం చేయడం ఒక అసామాన్యమైన అద్భుత దృశ్యం. ఆమె ముందు నేలమీద ఆయన కరిగిపోయినట్లే అనిపించేది. ఆయన నమస్కరించే విధానంలో ఆయన తన మనస్సు, శరీరాన్ని, ఆత్మను, సర్వస్వాన్ని ఆమె పాదాల చెంత అర్పణ మొనరించినట్లుగా కనిపించేది.**

**దాదాపు పదిహేను సంవత్సరాల కాలంపాటు శారదాదేవికి సన్నిహితంగా ఉంటూ ఆమె అవసరాలను తీర్చే విశిష్టమైన అవకాశం శారదానందస్వామికి లభించింది. ఆమె ఎదురుగా తనను తాను ఆయన ఎంత తక్కువగా భావించుకునేవాడో ఒకసారి ఆయన ఇట్లా వ్యాఖ్యానించారు "అమ్మను గురించి మనం ఏం అర్థం చేసుకోగలం? అయితే, నేను ఇది మాత్రం చెప్పగలను. అంతటి గొప్ప**



మనస్సును నేను ఎప్పుడూ చూసివుండలేదు. చూడగలనని ఆశించడమూ లేదు. ఆమె యొక్క కీర్తిని, శక్తి సామర్థ్యాలను అర్థం చేసుకోవడం మన సామర్థ్యానికి మించిన పని. అంతటి బంధాన్నీ, అంతటి బంధరాహిత్యాన్నీ నేనెక్కడా చూడలేదు. ఆమెకు రాధూతో ఎంతో గాఢమైన అనుబంధం ఉంది. కాని, ఆమె తాను మరణించడానికి ముందు 'ఆమెను (రాధూను) దూరంగా పంపెయ్యండి అంది. రాధూ ఆమెను ఇంక ఎంతమాత్రమూ ఆకర్షించ లేకపోయింది." ఒకసారి ఒక భక్తుడు శారదానందస్వామితో, తాను శ్రీరామకృష్ణుల దివ్యత్వాన్ని సులభంగా విశ్వసించగలనని, కనీసం ఆ నమ్మకాన్ని తనలో పెంపొందించుకోగలిగానని చెప్పాడు. కాని శారదాదేవిని మాత్రం తాను జగజ్జననిగా అర్థం చేసుకోలేకపోతున్నానని అన్నాడు. అది విని శారదానందస్వామి ఇట్లా వ్యాఖ్యానించారు "ఆవుపేడ నెత్తుకునే స్త్రీ కూతుర్ని భగవంతుడు వివాహం చేసుకున్నాడని నువ్వు భావిస్తున్నావా?" (అంటే శ్రీరామకృష్ణులు భార్యగా స్వీకరించిన స్త్రీ సామాన్యురాలు కారు సుమా అని అర్థం).

– శ్రీరామకృష్ణ మఠ ప్రచురణ

## 'గురు'బంధువు

గురువును గుర్తుకు తెచ్చేవాడు గురుబంధువు....
గురువు గొప్పతనానికి గర్వంతో ఉప్పొంగిపోయేవాడు గురుబంధువు
గురువు మహిమకు ముగ్ధుడై... ఆయన అవ్యాజ ప్రేమకు బద్ధుడైనవాడు గురుబంధువు....
గురువు పద్ధతికి అద్దంపట్టే నిబద్ధత కలిగిన వాడు గురుబంధువు....
గురువు దృక్పథమే పరమార్థపథంగా పొందినవాడు గురుబంధువు....
గురువు నేర్పిన ఇంగితజ్ఞానంతో గురుపదాలకు... గురుపాదాలకు అంకితమైనవాడు గురుబంధువు....
గురువు నిలిపిన ఆదర్శానికి నిదర్శనంలా నిలబడగలిగినవాడు గురుబంధువు....
గురువు విశిష్టతకు, విలక్షణ శిక్షణకు విశేష తార్కాణంగా తయారైనవాడు గురుబంధువు....
గురుభక్తిని... గురుపాదాల యందు అనురక్తిని... నిగిడించగలవాడు గురుబంధువు....
వ్యక్తి వేరైనా... వ్యక్తిత్వం వేరైనా... వ్యక్తీకరణ వేరైనా...
వ్యక్తమయ్యే భావం ఒక్కటే... గురుభక్తి...
అదే గురుబంధువు అన్నదానికి 'గురు'తు.



– శేఖర్, చెన్నై



# గురుకృపాలహరి

**గురుమధ్యేస్థితం విశ్వం విశ్వమధ్యే స్థితో గురుః**
**గురుర్విశ్వం నచోన్యోస్తి తస్మై శ్రీగురువే నమః**

"విశ్వము గురూత్తముని యందు వెలయుచుండు, గురువు విశ్వమునందు తా పరగుచుండు, గురువే విశ్వంబు, విశ్వమే గురువు సుమ్మి, అట్టి గురుదేవునకు నమస్సులర్పిస్తున్నాను" అంటుంది గురుగీత. విశ్వమంతా నిండిన ఆ పరమాత్మ మానవరూపం ధరించి తను నడుస్తూ ఈ సృష్టిని నడిపిస్తున్నాడు. మన దృష్టికి వారు కూడా కరచరణాదులతో తిరుగాడుతున్నట్లు కనిపిస్తున్నా, అనిపిస్తున్నా, మనోదృష్టితో చూడగలిగిన వేళ ఆ మహిమాన్వితుని సత్స్వరూపం మనం దర్శించుకోగలుగుతాము. సర్వజీవులలో వసించే వాసుదేవతత్త్వము, ఈశ్వరతత్త్వమే ప్రతి మనిషి మాధవుడేనని తెలియజెప్పడానికి, అవగతం అయ్యేందుకు, ఆచరించి చూపడానికి ఒక సమగ్ర స్వరూపంగా రూపుదాల్చుతోంది గురుస్వరూపంగా. గురుస్వరూపం అర్థమయితే భగవంతుని రూపం సాక్షాత్కరించినట్లేనేమో! అందుకే శ్రీసాయి 'అడ్డుగోడను కూల్చుమన్నది' అని తలపుకొస్తుంది. ఎన్నో విశేష సోదాహరణాలతో, వివరణలతో ఉదహరించే ప్రయత్నం చేసినా ఎందుకో కొన్ని అంశాలు ఇంకా అసంపూర్ణంగానే ఉండిపోతాయి. శ్రీరామ, శ్రీకృష్ణ. శ్రీసాయివంటి స్వరూపాలు ఎలా ఇన్ని కోట్ల జీవులకు సాంత్వనను కల్గించగలుగుతున్నాయి. పరిపక్వమనిపించే ఎన్ని కోణాలైనా అవి సంపూర్ణము అని చెప్పలేము. అట్టి అవతార పురుషుల కోవకు చెందిన వారే పరమాచార్యస్వామి. క్రితం సంచికలలో ఎన్నో సార్లు ఉదహరించుకున్నా మరలా వారి అవతార విశేషాల్ని గుర్తుచేసుకుని తరిద్దాం!

2018వ సంవత్సరంలో ప్రస్తుత కంచి పీఠాధిపతులు శ్రీవిజయేంద్ర సరస్వతీస్వామివారితో జరిగిన ఒక ఇంటర్వ్యూలో వారు చెప్పిన అంశాలు "ఈ శతాబ్దంలో రెండు విషయాలు జరిగాయి. ఒకటి, దేశ స్వాతంత్ర్యం కోసం అందరూ ఆస్తులు పణంగా పెట్టి, పెద్ద పెద్ద చదువులు చదువుకున్నవారు కలసి కృషి చేసి అనేక ప్రయత్నాలతో స్వతంత్ర భారతాన్ని ఆవిష్కరించారు. రెండవది, వేదాలు, శాస్త్రాలు, సంగీతము, మాతృభాష అభ్యుదయం, అవధానం, చిత్రలేఖనం, శిల్పశాస్త్రం, బుఱ్ఱకథ మొదలైన వాటి వ్యాప్తికి కృషి చేశారు. అలాగే సమాజానికి అవసరమైనప్పుడు ధర్మ ప్రచారము, ధర్మజ్ఞానము, ధర్మవిద్య వంటివి ప్రచారం చేశారు. ఈ విషయంలో ప్రముఖంగా కంచి



**లక్ష్యం ఉన్న వాడికి లక్షణాలు ఉండాలి.**



పరమాచార్యులవారు వారు ధర్మానికి, సమాజానికి సంబంధం ఏమిటి? సంబంధం ఎలా ఉండాలి? చట్టానికి శాస్త్రానికి ఏవిధమైన సౌజన్యం ఉండాలి? ఎలా అవగాహన ఉండాలి? అనేటువంటి విషయాలు ప్రతిపాదించి, ప్రభుత్వపాలనలో, ధర్మ ప్రచారంలో సేవాభావం ముఖ్యమన్న విషయాన్ని నాయకుల మనసుల్లో ఆలోచన కలిగించారు. స్వామివారి సంచారం చేత ప్రభావితమైన వారు పోటీ లేకుండా విద్య, వ్యవసాయం, ఉపాధి కల్పన విషయంలో పరస్పరం సహకరించుకుంటూ కొంతవరకూ చేశారు.

ఇంకోవైపు కుటుంబ వ్యవస్థ, సదాచారం, భక్తి ప్రచారం, వివిధ సంప్రదాయాలతో సమన్వయం, ఆస్తిక్యబుద్ధి, ఇలా రెండు మార్గాల వాళ్ళు దేశ ఉన్నతి కోసం, ధర్మ ప్రచారం కోసం కలసి పనిచేయడం అవసరం. స్వామివారి ఉద్దేశ్యాలుకాని, ఉపన్యాసాలుకాని, గంభీరంగా, ఔదార్యంతో లలితంగా ఉండేవి. అందువల్ల లాభం ఒక్క కంచి పీఠానికేకాక యావత్ సమాజానికి, విదేశీయులకు కూడా జరిగింది. పాల్‌బ్రంటన్ వంటి వారికి కూడా స్వామివారు జ్ఞానోపదేశం, మార్గదర్శకత్వం చేయడాన్ని చూస్తే పరమాచార్యులది పూర్ణావతారంగా అర్థమౌతుంది. వయస్సు కావచ్చు, జ్ఞానం కావచ్చు, వారి మనసు కావచ్చు. వీటి దృష్ట్యా వారిది పూర్ణావతారము" అంటారు శ్రీవిజయేంద్రసరస్వతీ స్వామివారు. ఎన్ని కోణాల్లోనో దర్శించవచ్చు శ్రీస్వామివారి లీలా వినోదాన్ని, సుజ్ఞాన భాండాగారాన్ని, సామాజిక బాధ్యతను. మానవ ప్రగతికై వారు అహరహం శ్రమించిన విధానాన్ని క్రితం సంచికలో మనం గమనించాం. వారు చెరువులు త్రవ్వించడం అనే 'పూర్త' ధర్మాన్ని భక్తజనులచే ఎంత హృదయంగమంగా చేయించారో. మరో ఉదాత్తమైన బాధ్యతను స్వామివారు ఎలా చేయించారో చూద్దాం. బంధువులెవ్వరూ లేక చనిపోయిన వారికి దహన సంస్కారాలను చేయడంలో జరిగే అలసత్వాన్ని, నిర్లక్ష్యాన్ని చూసి చలించిన స్వామివారు హిందూ ధర్మంలో చరించి అసువులు బాసిన వారికి దహన ఏర్పాట్లు, సమాధి చేసే కార్యక్రమాలకై ఒక స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేశారు. ఈ సభ అలా ఎవ్వరూ లేక చనిపోయిన వారికి గౌరవప్రదంగా అంత్యక్రియలు చేస్తుంది. ఈ సంస్థ మొదట కుంభకోణంలో ప్రారంభమైనా వారి సంకల్పానుసారంగా ఇతర ప్రాంతాలలోనూ విస్తరించింది. ఈ ఉదాత్తమైన బాధ్యతను గురించి వారి మాటల్లోనే – దయచేసి 'సాటివారికి సహాయపడటం' (జీవాత్మ కైంకర్యం) అనే ముఖ్య కార్యం గురించి ఆలోచించండి. పంచభూతాల నుండి ఎనలేని సాయాన్ని పొందుతూ సూర్యుడు, చంద్రుడు, జంతుజాలం నుండి పొందే ప్రయోజనానికి మనం



ఎలాంటి ప్రతిఫలాన్ని సమర్పించుకుంటున్నాం. మనం తిరిగి ఏ రకంగా ఋణం తీర్చుకుంటున్నాం? ఒంటరిగా పుట్టి, ఒంటరిగా జీవించి, ఒంటరిగా మరణిస్తామా? సమాజం చేసే మేలుతో ఎదిగిన మనం సమాజానికి తిరిగి ఏం ఇవ్వగలం? ఇతరులకు సాయపడటంతో మనం ఆ 'జీవాత్మ కైంకర్యాన్ని' చక్కగా చేసుకోగలం. ప్రతిరోజూ నిద్రించే ముందు ఒక్కసారి "నేను ఈ రోజు సమాజానికి పనికివచ్చే ఏ పనిని చేశాను అని గుర్తు చేసుకుని నిద్రించండి. ఇలా చేస్తే మీలోని సద్గుణరాశి ఇంకా స్థిరమౌతుంది." కుంభకోణంలో ప్రారంభమైన ఈ జీవాత్మ కైంకర్యం మొదటి ఆరు నెలల్లో 36 మందికి గౌరవంగా అంత్య సంస్కారాలను నిర్వహించింది. పూజ్య గురుదేవులు శ్రీసాయినాథుని శరత్ బాబూజీ గారి ఆశీస్సులతో ఈ మధ్యకాలంలో హైదరాబాద్ గురుబంధువులు ఈ జీవాత్మ కైంకర్యాన్ని నిర్వహించడం ముదావహం. "మౌలికమైన ఆధ్యాత్మిక సూత్రాలు ఎన్నటికీ మారవు" అన్న గురువుగారి మాటలు, వారు నింపిన మానవతా విలువలు ధర్మమేమిటో అవగాహనలో లేకపోయినా గురుచంద్రుల ఆశీస్సులతో ఆచరణలో వ్యక్తమవుతున్నాయి.

ఎన్నో వేల మైళ్ళ పాదయాత్ర అనంతరం స్వామివారు కాంచీపురంలో కొన్నాళ్ళు ఉండటానికి సంకల్పించారు. వారి ఈ సంకల్పం వెనుక తరువాత పీఠాధిపతిని నిర్ణయించే ఆలోచన కనిపిస్తుంది. 1953వ సంవత్సరం శంకరజయంతి కుంభకోణంలోని ఓరిక్కై గ్రామంలో జరిగింది. అక్కడి నుండి జులై 1953వ సంవత్సరం వ్యాసపూజకు మొదటిసారిగా స్వామివారు కంచి మఠ ప్రాంగణానికి వేంచేయడం, అక్కడే చాతుర్మాస్య ఆచరణ జరగడం, కంచికి మరోసారి మంచి విశేషమైన రోజులు వచ్చాయని భక్తజనులు సంతసించారు.

చాతుర్మాస్య కాలంలో పరమాచార్య స్వామివారు మౌనవ్రతం ఆచరించారు. పరమశివుడు ఒక సమయంలో బాలునిగా ప్రకటమై సనక, సనాతన, సనందన, సనత్కుమారులకు మౌన ఉపదేశం చేశారని ప్రతీతి. తత్త్వజ్ఞాన సంపదను పొందడానికి మహర్షులు మౌనాన్ని ఆచరించే వారని, అలా భక్తుడు కూడా మౌనాన్ని ఆశ్రయిస్తే ప్రత్యేక శక్తిని పొందగలడని యోగవాణి. స్వామివారు మూడు రకాలుగా మౌనాన్ని ఆచరించేవారు. కొన్నాళ్ళు ఏదైనా విషయం చెప్పాలంటే నేల మీద రాసి చూపేవారు, మరోసారి సైగలతోనూ, కంటి చూపుతోనూ విషయాన్ని చెప్పేవారు. ఇక మూడవది పూర్తి మౌనం. ఏ రకమైన సైగలు, సంజ్ఞలు ఉండేవికావు. దీనిని కాష్ఠమౌనం అని పిలుస్తారు. అలా స్వామి వారు నెలల తరబడి కాష్ఠమౌనంలో ఉండిపోయేవారు. ఇలాంటి సమయంలో బర్మా నుండి



వచ్చిన సంపన్న బౌద్ధుడు కాష్ఠమౌనంలో ఉన్న స్వామివారి అనుగ్రహ వీక్షణంతో గొప్ప ఆధ్యాత్మిక సాంత్వనను పొందినట్లు పంచుకున్నాడు భక్తులతో.

శ్రీఆదిశంకరులు 'సోపాన పంచకం'లో తురీయావస్థలో ఉన్న సాధకునికి ఇలా సందేశం ఇచ్చారు. "నిత్య జీవితంలో కలిగే ఆకలి అనే వ్యాధికి భిక్షాన్నాన్ని ముందుగా ఇవ్వండి. భగవదనుగ్రహంతో ఏది పొందితే దానితో సంతృప్తి చెందండి." బహుశా ఈ సలహాను స్వామివారు తమ ఆహార అలవాట్లలో పాటించినట్లున్నారు. వారు చాలా తక్కువ మోతాదులో ఆహార సేవనం చేసేవారు. వారు పీఠారోహణ చేసిన రెండు సంవత్సరాల నుండే అంటే వారి పదిహేనవ సంవత్సరం నుండే రోజుకు ఒక్కసారి, అదీ ఉప్పు, కారం, చింతపండు లేని ఆహారాన్ని సేవించేవారు. ఇంకొంతకాలం గడిచాక పచ్చిపాలను(కాగపెట్టని) మాత్రం స్వీకరించేవారు. మరికొన్ని సార్లు బిల్వ, వేప ఆకులను మాత్రమే స్వీకరించేవారు. ఇటువంటి ఆహారం వారి ఆరోగ్యాన్ని ఇబ్బంది పరచినా వారి మేథోశక్తి మాత్రం అగ్రశిఖరాలను చేరింది. వారు ఆహారం స్వీకరించే రోజుల కంటే వారు నిరాహారంగా ఉండే రోజులే ఎక్కువగా ఉండేవి. నవరాత్రి సమయాల్లో వారు పూర్తిగా నిరాహారంగా ఉంటూనే రోజూ ఎనిమిది గంటలు పూజాదికాలు జరిపేవారు. పరమాచార్యుల అరుదైన, మహత్తరమైన అంశం వారి జ్ఞాపకశక్తి. నిత్యమూ కొన్ని వందల మంది వారి దర్శనం చేసుకుని వారి కష్టసుఖాలను విన్నవించుకుంటూ వారి అనుగ్రహాశీస్సులు అర్థించేవారు. క్రమంగా ఆ సంఖ్య వేలమందిని చేరుకున్నా ఏనాడూ స్వామివారు ఏ భక్తుని అయినా, ఆయా భక్తుని అవసరాలను, అంతరంగంలోని ఆలోచనలను కూడా మరచిపోకుండా ఎన్నో వసంతాల తరవాత కూడా వారిని కుశలప్రశ్నలనడగటం, తప్పటడుగులను దిద్దడం, వారి పెద్దల మంచితనాన్ని, ఔదార్యాన్ని, భక్తిప్రపత్తులను గుర్తుచేసి మరల వారిని సనాతన ధర్మంవైపు నడపడం చేసేవారు పరమ ప్రేమతో. కాంచీపురం చేరాక స్వామి వారి సామాజిక సేవ గణనీయంగా పెరిగింది. "సామాజిక స్పృహ – క్రియాశీలత లేని శుష్కమైన ఆధ్యాత్మికతను 'సాయిపథం' కూడా ఎన్నడూ సమర్థించలేదు, సమర్థించదు". అప్పటికే కొన్ని సంవత్సరాల నుండి పరమాచార్య స్వామివారు తమ ఉత్తర పీఠాధిపతిని నియమించి వారికి పీఠ పాలనను, ఔన్నత్యాన్ని, సంప్రదాయాలను నేర్పించాలని ఆలోచన చేస్తున్నారు. దక్షిణ రైల్వే, తిరుచ్చిలో పనిచేస్తున్న శ్రీమహదేవ అయ్యర్ కుమారులైన శ్రీసుబ్రహ్మణ్యాన్ని తమ శిష్యునిగా స్వీకరించి ఉత్తర పీఠాధిపతిగా నియమించారు. చిన్నతనం నుండే వేదాధ్యయనపరుడైన శ్రీసుబ్రహ్మణ్యానికి



సన్యాసాశ్రమమిచ్చి, ఉపదేశం చేసి వేలాది భక్తుల శంకర నామాల మధ్య మార్చి 19 – 22, 1954వ సంవత్సరంలో పీఠారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముందే కలవైలోని వారి గురువులు, పరమ గురువుల అధిష్ఠానముల దర్శనం, పూజాదికాలు నిర్వహించారు పరమాచార్య స్వామి. తమ ఉత్తర పీఠాధిపతికి 'శ్రీజయేంద్ర సరస్వతీ' స్వామిగా సన్యాసాశ్రమ నామధేయాన్ని విజయం చేశారు స్వామి. ఈ క్రమంలో స్వామివారు చేసిన అనుగ్రహ భాషణాన్ని గమనిస్తే ధర్మాన్ని ముందుకు తీసుకువెళ్ళే నాయకుని లక్షణాలు ఎలా ఉండాలో, జగద్గురుచంద్రులను విశ్వసించిన భక్తజనుల నడవడి ఎలా ఉండాలో రాబోయే తరాలకు మార్గదర్శనమౌతుంది. తమ జీవితాలను మనిషి దైవంగా ఎదగడానికి పరిపూర్ణంగా అర్పించి అహర్నిశలు ఆశ్రితులను కాపాడుకోవడానికి సావధానులై ఉండే ఆ మహితాత్ములు అవనికి వేంచేస్తే వారిని, వారి సమయాన్ని, వ్యవస్థలను నిర్వహించడానికి వినియోగించుకుంటున్నామంటే మనం ఎంత అవివేకంగా జీవిస్తున్నామో అర్థం చేసుకోవాలి. శ్రీరాముడు మర్యాదా పురుషోత్తముడై సకల ధర్మాలను – సంఘంలో ఉన్నప్పుడు పౌర ధర్మాన్ని, గురువు చెంత ఉన్నప్పుడు శిష్య ధర్మాన్ని, ధర్మపత్ని సీతతో ఉన్నప్పుడు భర్త ధర్మాన్ని ఎలా పాటించాడో – సన్యాసాశ్రమ, పీఠాధిపత్య, ధర్మ పరిరక్షణ, సముద్ధరణ, నాయక లక్షణాలను స్వామివారు పొల్లుపోకుండా పాటించారు. 'శంకర' విజయ నామధేయులైన స్వామి ఆదిశంకరుల పరంపరాగత ధర్మాన్ని ముందుకు తీసుకువెళ్ళే క్రమంలో ఎక్కడా సంకోచం లేకుండా, పారదర్శకంగా, నిర్మాణాత్మకంగా, దార్శనికంగా భక్తజనుల బాధ్యతను కూడా గుర్తు చేశారు. మనం కూడా నేర్చుకోవాల్సిన అంశాలు ఇందులో ఉన్నాయి. జగద్గురు చంద్రులవాణి – శరశ్చంద్రులను ఆశ్రయించుకున్న వారికి చుక్కాని. వారి మాటల్లో...

**"ఈ పీఠం కోసం ఉత్తర పీఠాధిపతిని ఆహ్వానించుకుంటున్న ఈ శుభ సమయంలో మీకు నేను కొన్ని విషయాలను చెప్పాలనుకుంటున్నాను. ప్రస్తుతం మఠం, దాని కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించడానికి సరిపడా వనరులు మనకు అందుబాటులో లేవు. మన వ్యయం సుమారు మన ఆదాయానికి ఐదురెట్లు ఎక్కువగా ఉంది. మీరు కొత్త పీఠాధిపతులను ఆహ్వానిస్తూనే, మఠ కార్యకలాపాలను కొనసాగించుకోవడానికి సహాయం చేయాలి. మామూలుగా అయితే నేనెప్పుడూ ఈ విషయాలను మీతో మాట్లాడను. కానీ ఈ పరిస్థితిని మీకు తెలియజేయడం తప్పనిసరి అని భావిస్తున్నాను. ఇక్కడ ఉన్నవారు, ఇతర భక్తుల కుటుంబాలు, మఠం పట్ల మానసిక అనుబంధం**



కలిగి ఉండాలి. తమ సొంత కుటుంబాలను నిర్వహించుకోవడమే కష్టంగా ఉన్న ఈ రోజుల్లో మఠాన్ని కూడా తమ కుటుంబంగా భావించి చిన్నగా సాయమందించాలి. ఆర్థిక సాయం అందించడమేకాక, మఠానికి భౌతిక సేవను అందించడం ముఖ్యం. ఇక్కడ వేతనం లేని వాలంటీర్లు ఎందరో ఉన్నారు. మీ అందరకూ అది సాధ్యం కాకపోవచ్చు, కానీ కొందరైనా మీ సమయాన్ని, మీ శ్రమను ఆ చంద్రమౌళీశ్వర సేవకు నియోగించవచ్చు. మఠానికి డబ్బు ఇవ్వడం కంటే ఈ విధమైన సేవ చాలా ప్రశంసనీయం. మన ధర్మంపై మనకు విశ్వాసముండటంతోపాటు, ఆ ధర్మాన్ని ముందుకు తీసుకువెళ్ళే మఠ కార్యక్రమాలపై శ్రద్ధ వహించడం మన బాధ్యతగా స్వీకరించండి. మీకు ఆ త్రిపురసుందరీ సమేత చంద్రమౌళీశ్వరుని అనుగ్రహాశీస్సులు ఎప్పటికీ ఉంటాయి.”

భక్తజనుల వినతులే ఆహారంగా, నిరాడంబర జీవనమే ఆహార్యంగా సాగిన వారి జీవితం వారి గురువు చూపిన ధర్మాన్ని ముందుకు తీసుకువెళ్ళే క్రమంలో సాధారణ విషయాలను కూడా మనకు గుర్తు చేసింది కదూ! ఇదిగో ‘సాయిపథం’ పునాదులు గుర్తుకొస్తున్నాయి. “వ్యక్తి తన ఆంతర్యం పట్ల, జగత్తు పట్ల, జీవితం పట్ల సరైన అవగాహనను పెంపొందింప చేసుకుని, దానికి అనుగుణమైన సద్ధర్మాచరణ ద్వారా మాత్రమే లభ్యమయ్యే సుఖశాంతులను పొంది, తాను పొందిన అవగాహనను తోటివారితో పంచుకోవడం అనే ఆదర్శమే ‘సాయిపథం’కు పునాది”. అవగాహన పెంపొందడం సరే! తరతరాలకు దానిని పంచుకోవడం జరగాలంటే మనకు శ్రీసాయితో, గురుదేవులతో ఉన్న కరుణానుబంధాన్ని దృఢం చేసుకోవాలంటే మనం ‘సాయిపథం’ పట్ల బాధ్యతతో మెలగాలి. పొందిన ప్రేమను పంచుకునే క్రమంలో ఎలా జీవిస్తే ఈ పథం తరతరాలను తరింప చేస్తుందోనన్న ఆలోచన కలగాలి. చిన్నా, పెద్దా బేధం లేకుండా స్వచ్ఛందసేవలో పాల్గొనాలి. వ్యవస్థీకృతం కాని వ్యవస్థను నిర్మించుకోవాలి. మన గురుదేవుల బాటలో ప్రతి ఆదర్శాన్ని అందిపుచ్చుకు జీవిస్తూ, రాబోయే తరాలకు సద్గురుపథాన్ని సమున్నతంగా అందించాలి. బండ్లకొద్దీ ప్రేమను పొందాం, పొందుతున్నాం. సద్గురుపథానికి వన్నె తెచ్చే ఆచరణను పుణికి పుచ్చుకుందాం. తండ్రికి తగ్గ బిడ్డలమై – మన బిడ్డలకూ ఆ ఆనంద పథాన్ని అందిద్దాం. ఏది మన బాధ్యత? ఈ రోజున మనం ఎలా ఉన్నాం? ఎలా ఉంటే తండ్రికి తగ్గ బిడ్డలమౌతాం... ఆలోచిస్తూ ఆరాధన వైపుగా అడుగులు వేద్దాం... మన ఆచరణే నిజమైన ఆరాధన... ప్రేమ...అంతే...

– గురుకృప



“మనో సంబంధమైన దుఃఖాన్ని తొలగించేది ఆధ్యాత్మికత.
దేహ సంబంధమైన దుఃఖాన్ని తొలగించేది వైద్యం.
మొదటిది సూక్ష్మము, రెండవది స్థూలము. రెంటి లక్ష్యం దుఃఖ నాశనమే.
వ్యక్తి మొదట తన దేహ సంబంధమైన దుఃఖం తొలగించుకోవాలని
ఆరాటపడతాడు. అది తొలగిన తరువాత, దానికంటే సూక్ష్మతరమైన దుఃఖాన్ని
గుర్తించి, దాన్ని కూడా తొలగించుకోవాలని ఆయత్తమవుతాడు.
సర్వజీవుల్లోనూ ఉన్న ఒకే భగవత్ తత్త్వాన్ని గుర్తించమని, వారి దుఃఖాన్ని చేతనైనంత
వరకు తొలగించమని బాబా ఉద్బోధించారు. సరైన అవగాహనతో సాటి వ్యక్తి యొక్క
బాధను గుర్తించి, దాన్ని తొలగించేందుకు ప్రయత్నం చేయడం కూడా
ఆధ్యాత్మిక సాధనలో భాగమే అవుతుంది. దుఃఖంతో మన వద్దకు వచ్చిన
వారికి చేతనైనంతలో సాంత్వన కల్గించడానికి యత్నించడం
మన ధర్మం. నా దృష్టిలో మందు కేవలం మిషే! వ్యాధిని తగ్గించే అసలు ఔషధం
సాయికృపే! ఈ మందు సాయికృపకు ఒక వాహకం.
ఈ వైద్యం సాయికృపాశక్తిని నిరూపించే ఒక సాధనం” అని విశదపరిచారు.
ఆ తర్వాత రోజులలో మందులతోనిమిత్తం లేకుండా
శ్రీబాబూజీ పవిత్ర హస్తాల మీదుగా ‘బాబా ఊదీ’ తీసుకున్నా
ఉపశమనం కలగడం భక్తులకు అనుభవమయింది.
ఊదీ – బాబా ధుని నుండి వచ్చింది. దానికి ఆయన స్పర్శ,
సాన్నిధ్యం ఉంది. ఆ స్పర్శ, సాన్నిధ్యం ఉన్న ధునికే అయినా
ఊదీ ఆ ధునిలో మండుతున్న అగ్ని యొక్క ఫలితం.
అందువలన వారి సాన్నిధ్యం, స్పర్శ ఆ ధునిలోనే ఊదీకి
ఖచ్చితంగా ఉంది.

శ్రీబాబూజీ





విదేహులైన వారు శాశ్వతులు.

"ప్రేమ-ఆనందాలే" ఆ ఇరువురి జీవన సందేశాలు.

సర్వజీవులలో ప్రేమ రూపంలో వ్యక్తమయ్యే దివ్యభావనే వారు.

తమ దివ్య ప్రేమానంద సామ్రాజ్యంలోకి మనబోంట్లను స్వీకరించడానికి

భగవంతుడు తీసుకున్న భౌతికరూపం 'సద్గురువు'.

వారు దేహాన్ని వదిలివేసారు. కానీ మనల్ని వదలలేదు.

మనల్ని నిరంతరం కాపాడుతూనే ఉన్నారు, ఉంటారు. ఇది అక్షర సత్యం.

అనునిత్యం 'సద్గురువు' అనే దివ్యకాంతి (ప్రేమ, ఆనందం) నేటికీ వెలుగులు విరజిమ్ముతూనే ఉన్నది.

మన పాలిట కల్పతరువై వెలుగొందుతూనే ఉన్నది. ఇది శాశ్వతలీల.

ఎందుకంటే వారు నిత్యసత్యులు, నిత్యనూతనులు. నిత్యతృప్తులు, నిత్యకృత్యులు...

**- గురుకృప**


gurukrupa.info    +91 83672 00045